

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :15 సంచిక: 09 హైదరాబాద్ 2016 జనవరి పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# ఆంధ్రా రెస్టు హౌస్

అమరతిథికి విచ్చేసే బాబా ప్రేమికులందరికీ ఆంధ్రా రెస్టు హౌస్ స్వాగతం పలుకుతోంది. రెస్టు హౌసు ప్రాంగణానికి అనేక మరమ్మత్తులు చేయించారు. ఆకర్షణీయమైన రంగులు వేయించారు. అమరతిథికి విచ్చేసే యాత్రీకులందరికీ, ముఖ్యంగా తెలుగువారికి సుమారు 500 మందికి భోజన వసతి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ విషయంలో జీవిత సభ్యులు, స్త్రీలు, వృద్ధులకు ప్రాధాన్యత ఇచ్చారు. వారందరికీ అమరతిథి మూడురోజూలూ ఎగువ మెహెరాబాద్‌లోని బాబావారి దర్శనార్థం వెళ్ళేందుకు రాత్రింపగళ్ళు ఉచిత రవాణా ఏర్పాటు చేశామని కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

## జలనిధికి విరాళం

గత కొంత కాలంగా, అంటే 2013 అక్టోబరు మాసంలో శ్రీ వై.యస్. రావు బాబాలో ఐక్యమయినప్పటి నుండీ రెస్టు హౌస్‌కు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతిరోజు స్థానికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తునట్లు, తద్వారా అధిక ఆర్థిక భారాన్ని భరించవల్సివచ్చిందని అన్నారు. ఈ ఆర్థిక లోటును పూరించవల్సిన ఆవశ్యకత ఎంతో వుందని చెబుతూ శ్రీ వై.యస్. రావు గారు ఏర్పాటు చేసిన **'జలనిధి'కి** తగిన విరాళాలు అందజేసి సహకరించవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు.

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 19 లేదా 20 తేదీలలో సికింద్రాబాద్‌లో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీ నాటికి పత్రిక మీ ముంగిట వుంటుంది. పత్రిక అందటంలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. గత రెండేళ్ళుగా వార్షిక సభ్యత్వం చెల్లించని సుమారు 200 మంది సభ్యుల చిరునామాలను **2016 ఫిబ్రవరి 28 నుండి తొలిగించవలెనని నిర్ణయించడమైంది. అలాగే, జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించిన సుమారు నూరు మంది కూడా 2016 ఫిబ్రవరి 28 లోగా వారి బాకీ నగదు రూ 500 వెంటనే చెల్లించవలెనని మనవి. కానిపక్షంలో వారు చెల్లించిన నగదును వార్షిక సభ్యత్వం క్రింద జమ చేసుకోవలెనని నిర్ణయించడమైంది. దయచేసి బాబా ప్రేమికులు సహకరించగలరు.**

మీ సలహాలు, ఫిర్యాదులు, అమరతిథి ఎగ్జిబిషన్ స్టాలులో తెలియజేయగలరు. మరిన్ని వివరాలకు మొబైల్ నంబరు 995955 3218 సంప్రదించగలరు. **– ఎడిటర్**

## బాబా సందేశం

కోరికలు ఎప్పటికీ హానికరమే.

కోరికలు నెరవేరినా, కాకపోయినా కూడా ప్రమాదమే.

Desires are harmful both ways when fullfilled & not fulfilled

–మెహెర్‌బాబా


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**krishnanandm@yahoo.com**

**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**

**దశిక ప్రసాదరావు**

**040-65699611**


## లోపలి పేజీలలో...


| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. అమరతిథి | 6-7 |
| 3. మెహెర్‌బాబా సమాధి | 8-11 |
| 4. మరాఠీ సహవాస్ | 12-16 |
| 5.మా మాటలు | 17-19 |
| 6. లార్డ్ మెహెర్ | 20-28 |
| 7. డేలియా డి లియోన్ | 29-32 |
| 8. జమా ఖర్చులు | 33-36 |
| 9. సింహావలోకనం | 37-38 |
| 10. మా మాటలు | 39 |



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,

మెహెర్‌బాబా,

గోదావరి గార్డెన్స్, యాప్రాల్,

ప్లాట్ నెం. 32,

జె.జె. నగర్‌కాలనీ ,

సికింద్రాబాద్-500 087

ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# హైదరాబాద్ నుండి మెహెరాబాద్

అవతారుని అమరతిథికి మెహెరాబాద్‌కు తమ కార్లు ఇతర ప్రత్యేక వాహనాలలో వెళ్ళేవారికి వీలుగా డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, హైదరాబాద్ రెండు చక్కని రూట్ మ్యాప్ పంపారు. ఆ రెండింటిలో రెండవ రూట్‌లో, హైదరాబాద్ నుండి షోలాపూర్ మీదుగా వెళ్ళడం ఉభయకుశలోపరని ఆయన అన్నారు. ఐతే, మొదటి రూట్‌లో ట్రాఫిక్ రద్దీ అధికంగా వుండదు. రెండవ రూట్‌లో రహదార్లు బాగుంటాయి. ట్రాఫిక్ కూడా అధికమే! ఆ వివరాలు ఇలా వున్నాయి. పరిశీలించండి!!

**ROUTE 1:**

Hyderabad(Koti)-Patancheru-Sangareddy X Roads(54KM)-Zaheerabad(95KM)-Humnabad(160KM)-Umarga(219KM)-Naldurg(260KM)-Tuljapur(291KM)-Osmanabad(319KM)-Yedashi-Yermala-Bhoom(379KM)-Jhamkhed(431km)-Ahmadnagar(508KM)-Meherabad(515KM).

**ROUTE 2:**

Hyderabad(Koti)-Patancheru-Sangareddy X roads(54KM)-Zaheerabad, Humnabad, Umarga, Naldurg, Sholapur(302KM)-Tembhurni(390KM)-Jeur(416KM)-Karmala(455KM)-Miraj Goan-Arangoan(550KM)-Meherabad(552KM).

# ఖాజాగూడా గుహ

హైదరాబాద్ నగర శివార్లలోని ఖాజాగూడా గుహలో అవతారుడు 1951 ఆక్టోబరులో ఏకాంతవాసం, మనోనాశ్ కార్యక్రమాన్ని నిర్వహించారని పాఠకులకు తెలుసు. ఇంతక్రితం వరకూ ఇక్కడకు వెళ్ళాలంటే, హైదరాబాద్ వారికి కూడా మెహెరాబాద్ దాకా వెళ్తున్నామా అన్నట్లు వుండేది. సరైనా రవాణా సౌకర్యం ఉండేది కాదు. ఇప్పుడా చింత లేదు. రవాణా సౌకర్యం విరివిగా దొరుకుతోంది. నేడు ఇక్కడ ప్రతి రెండవ శనివారం ఉ. 8.30 నుండి రెండు గంటలు సత్సంగ్ నిర్వహిస్తున్నారు. అలాగే, ప్రతి ఆదివారం ఉదయంపూట మొక్కలు నాటే కార్యక్రమంలాంటి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ దఫా మీరు హైదరాబాద్‌కి వస్తే ఖాజాగూడా తప్పక సందర్శించండి. దూరప్రాంతీయులకు జూబ్లీ సెంటర్‌లో బస ఏర్పాటుకూడా వుంది. మరిన్ని వివరాలకు శ్రీ పి. రాజేంద్రమెహెర్ (98-49-046848) సంప్రదించగలరు.

## సంపాదకీయం — తిన్నగా ఇళ్ళకెళ్ళండి!!

గమనించండి!! మెహెరాబాద్ అమరతిథికి హాజరయ్యేవారందరూ మీ తిరుగు ప్రయాణంలో తిన్నగా మీ ఇళ్ళకెళ్ళండి. బాబాను మీతో మీ ఇళ్ళకు తీసుకెళ్ళండి !! ఇది అవతారుని ఆదేశం. మెహెర్‌బాబా స్వయంగా చెప్పిన మాటలివి. 1955 నవంబరులో మెహెరాబాద్‌లో జరిగిన మరాఠీ ప్రేమికుల సహవాస్‌లో ఈ విషయాన్ని బాబా చాలా స్పష్టంగా చెప్పారు. సహవాస్‌లో ఆఖరి రోజున అందరూ తమ ఇళ్ళకు బయల్దేరారు. వారితో బాబా – మీరిక్కడ నుండి తిన్నగా మీ ఇళ్ళకు వెళ్ళండి. మీతోపాటు నన్ను మీ హృదయాల్లో పదిలంగా తీసుకెళ్ళండి. మీకేమైనా వ్యాపారసంబంధ లావాదేవీలుంటే, ముందుగా మీ ఇంటికి వెళ్ళి, ఆ తర్వాత మీరెక్కడికైనా వెళ్ళండి. అలాకాని పక్షంలో, మీరు సహవాస్ కోసం 50%, మీ పనుల కోసం 50% మీ సమయాన్ని కేటాయించినట్లన్నారు. దారిలో ఎక్కడా ఆగవద్దని హెచ్చరించారు. బాబావారి సంజ్ఞలను మరాఠీ భాషలోకి అనువాదం చేస్తున్న బాబా ప్రేమికుడు –శ్రీ ధాకే ఫాల్కర్, **బాబా చెప్పిన మాటలకు అదనంగా పండరీపూర్, షిరిడి, సాకోరీలకు** కూడా వెళ్ళరాదని ప్రకటించాడు. బాబా ఈ మాటలతో చికాకు పడ్డారు. ధాకే ఆ మాదిరిగా నోరుజారడంతో, ఎవరైతే ఆ మూడు ప్రదేశాలకు వెళ్ళాలనుకుంటున్నారో హాయిగా వెళ్ళమని, తానిచ్చిన ఆదేశాలను సడలిస్తున్నానన్నారు బాబా. మీరెక్కడకు వెళ్ళాలనుకుంటే అక్కడకి మీరెళ్ళొచ్చు. ఐతే, అదే పనిమీద వెళ్ళొద్దు. మీరు అక్కడకు వెళ్ళకూడదని నా ఉద్దేశ్యం కాదు. **మెహెరాబాద్‌కు రావడమంటే అది తీర్థయాత్రలకే తీర్థయాత్రని గమనించమన్నారు.** కానీ, ధాకే తన అనువాదంతో తీవ్ర గందరగోళం సృష్టించాడు కాబట్టి, ఎవరైతే షిరిడి, సాకోరి, పండరీ వెళ్ళాలనుకుంటారో వారు దివ్యంగా వెళ్ళండని బాబా అన్నారు. నేను చెప్పేదానిలో ఒక అక్షరం అటు ఇటుగా మార్చి చెబితే అనేక అపోహలు కలిగే అవకాశం ఉందన్నారు బాబా. బాబావారి మాటల్ని తిరిగి మరాఠీలో అనువదించలేకపోయాడు ధాకే. కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. తిరిగి బాబా సంజ్ఞలతో, మీరు నేరుగా మీ ఇళ్ళకు వెళ్ళండి. అన్ని ప్రాంతాలూ నావే అన్నారు. నా దగ్గరకు వచ్చి, తిరిగి మీ సొంత పనుల కోసం అక్కడికీ ఇక్కడికీ వెళ్ళరాదు. మీరంతగా ఇష్టపడితే మీ ఇళ్ళకెళ్ళి ఆ దరిమలా మరోమారు షిరిడి, సాకోరి, పండరిలకు వెళ్ళండని బాబా సూచించారు. బాబా ఇంత సుదీర్ఘ వివరణ ఇచ్చాక కూడా ఓ పెద్దాయన లేచి తాను నేరుగా ఇంటికి వెళ్ళడానికి గల కష్టాలేవో చెప్పుకొచ్చాడు. వ్యక్తిగతంగా కష్టాలుండవచ్చు. వాటి పరిష్కారమార్గాలు మీ చేతుల్లోనే వుంటాయి. నేను చెప్పదల్చినదేదో చెప్పాను. తెలుగు గ్రూపు సహవాస్‌కు కట్టా సూబ్బారావు వచ్చాడు. అతను ఇక్కడ వుండగా అతని వ్యాపారం కోసం బొంబాయికి వెళ్ళమని మూడు టెలిగ్రాంలు, ఒక అర్జంటు ఫోన్ కాల్ వచ్చింది. అతను ఏం చేయ్యాలని నన్ను అడిగాడు. నేను చెప్పింది చేయాలనుకుంటే ముందుగా నీవు నీ ఇంటికి వెళ్ళు. ఆ తర్వాత బొంబాయికి వెళ్ళమని చెప్పాను. అలాగే చేశాడతను. నీనిక్కడ వున్నది మీసమస్యలు తీర్చడానికి కాదు. **అవన్నీ అముఖ్యమ**ని, బాబా ఆ ప్రస్తావన అంతటితో ముగించారు.

# అమరతిథి




**మల్లాది కృష్ణానంద్**

అమరతిథి విశిష్టతపై బాబా ట్రస్టు, చైర్మన్ భావూ కల్చూరి బాబా ప్రేమికులను ఉద్దేశించి గతంలో చేసిన స్వాగతోపన్యాసం ఇలా ఉంది. దయచేసి పరిశీలించండి. “ప్రియతమ మెహెర్‌బాబా సశరీరులుగా మనల్ని కలవటం మానేసిన రోజుని అమరతిథి గుర్తుచేస్తుంది. అవతారుడు సర్వే సర్వత్రా వున్న వైనానికి అద్దం పడుతుందీ రోజు. ప్రియతమ బాబా భౌతికంగా మన మధ్యన లేకపోయినా తమ కార్యక్రమాల్ని యాధావిధిగా నిర్వహిస్తున్నారు. ఇది వారి విశ్వకార్యక్రమం.

అది ఏమిటో మనకెవ్వరికీ అంతుబట్టదు. ఆ సంగతి అలా వుంచితే, బాబావారు సశరీరులుగా వున్నప్పుడు తమ కార్యక్రమాన్ని రెండు స్థాయిలో చేసేవారు. ఒకటి మనందరి కళ్ళకి కనిపించే భౌతిక ప్రపంచం, రెండవవది మన కళ్ళకి కనబడని ఆంతరంగిక ప్రపంచం ద్వారా. తమ దగ్గరకి వచ్చిన అందరి సంస్కారాలనీ ఆయన తీసుకొనేవారు. తన వద్దకు రాని వారికీ ఈ వరాన్ని ప్రసాదించే వారు.

సద్గురువులు ఐదుగురు. వీరి బాధ్యతలు దైవీ ప్రణాళిక ప్రకారం వుంటాయి. అవతారుని పని యావత్తు సృష్టినీ ఆధ్యాత్మికంగా ముందుకు ఒక్క త్రోపు త్రోయటం. ఈ పని సద్గురువులు వల్ల కాదు. వాళ్ళు చేయలేరు. అందుకనే భగవంతుడు మానవ రూపం ధరించి అవతరిస్తున్నది. ప్రపంచాన్ని ఆధ్యాత్మికంగా ముందుకు తీసుకువెళ్ళేది.

ముందుకు తీసుకు వెళ్ళటమేమిటి? ఒక్క త్రోపు తోయట మేమిటి?

అవతారుడు ప్రాణి కోటి యొక్క చైతన్య స్థాయిని పెంచుతాడు. వాయు దశ నుంచి అన్ని దశల్లోని ప్రాణులకీ అవతారుని వరం లభిస్తుంది. రాయి, లోహం, కూరాకు పురుగు, చేప, పక్షి, జంతువు వంటి వివిధ దశల్లోని ఆత్మకీ, మనుష్యులకీ కూడా అవతారుడు వల్ల చైతన్య స్థాయి పెరుగుతుంది.

సద్గురువు కూడా చైత్య స్థాయిని పెంచగలదు. అయితే ఆయన మండలి (సర్కిల్) లో వారికి మాత్రమే అలా చేయగలడాయన. కుక్క, పిల్లి, చిలుక వంటి పెంపుడు జంతువులకి కూడా సద్గురువు చైతన్య స్థాయిని పైకి త్రోయ గలడు. కానీ, అవతారునిలా, ప్రాణులందరకీ, ఆధ్యాత్మిక లబ్ధిని కల్గించలేడు. అందుకనే, అవతారుడు దిగి వస్తున్నాడు. యావత్తు మానవాళికి ఆధ్యాత్మికోన్నతి కల్గిస్తున్నాడు. ప్రపంచంలో ఎన్నో మతాలున్నాయి. ఎందరో అవతార పురుషులున్నారు.
ఒక్కో మతానికి వొక్కో అవతారుడు. మతాలు వేరైనా అవతారుడు ఒక్కడే. జొరాస్టరు, మెహెర్‌బాబా ఒక్కరే. ప్రతి యుగంలో భూమిపై అవతరిస్తున్న పరాత్పరుడు వొక్కడే. పేరు, రూపం, రంగు వేరు అంతే. అలా ఎందుకు అంటే, ఆయా కాలమాన పరిస్థితులకి తగ్గట్టుగా పై నుంచి దిగి వస్తాడు పరిస్థితులకి తగ్గట్టు ప్రవర్తిస్తాడు. ఐతే, ప్రజలకీ సంగతి అర్థం కాదు. ఒక్కటే అన్న భావన తెలీయక మతాల మధ్య అడ్డుగోడలు కట్టుకుని ఒకరిపై ఒకరు కత్తులు దూస్తాము. రక్తపాతం సృష్టిస్తాము. ఈ మతాల మధ్య వైరుధ్యం, పోరాటం - ఇద్దరు సోదరులు కొట్టుకోవటమే. ఒకరి నొకరు చంపుకోవటమే. మనం మతాల మధ్య బేధ భావం సృష్టించ కూడదు. ఈ వేళ అమరతిథి నాడు ఈ సంగతి మనం బాగా గుర్తుంచుకోవాలి.
యుగ యుగాలుగా అవతరిస్తున్న దేవ దేవుడు ఒక్కడేనన్న నగ్న సత్యాన్ని మనం బాగా జ్ఞాపకం పెట్టుకోవాలి. మనం అదృష్టవంతులం. అందుకే మనకీ ఎరుక కలిగింది. మనం మతం వెనుక కాకుండా, ఈ మతాలు ఘోషించే సత్య సూక్తం వైపు కదిలి వెళ్ళాలి. అవతారుడు శరీరం వదిలిపెట్టినా, సజీవంగానే వుంటారు.
తమ విశ్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే వుంటారు. ఒక రోజా, రెండు రోజులా, వందేళ్ళ వరకూ అవతారుడు చురుకుగా పనిచేస్తూనే వుంటారు. ఈ కాలంలో మీరు పిలిచినా, పిలవక పోయినా మీకు సహాయం చెస్తాడు. అయితే వంద ఏళ్ళు అయ్యాక ఆయన విశ్రాంతికి వెళ్ళి పోతాడు. అప్పుడు కేవలం పిలిచితే పలికే దైవం అవతారుడు. బాబా సశరీరం వదిలి 46 సంవత్సరాలయింది. విశ్వ వ్యక్తీకరణ 54 సంవత్సరాలు పడుతుంది. ఈ వచ్చే 54 సంవత్సరాలు బాబా ఎప్పటిలానే మన మధ్య భౌతికంగా వున్నట్లుగానే వుంటారు. ఆ దరిమిలా మనస్ఫూర్తిగా పిలిస్తే పలుకుతారు. అవతారుడు సర్వ శక్తిమంతుడు. ఆయనకి రేపు లేదు. నిన్న అసలే లేదు. భగవంతునికి వున్నది కేవలం నేడు మాత్రమే. పరాత్పరుడికి అన్ని రోజులు నేటి క్రిందనే లెఖ్ఖ. మరచిపోకండి. అమరతిథి కూడా అంతే. నిన్న, రేపు లేదు. అమరతిథికి కేవలం ఈ వేళ మాత్రమే. నిన్న, రేపు మరచి పోవాలి. అప్పుడే మనకి 'నేడు' ఈనాడుగా మారుతుంది.

# ప్రత్యేకం మెహెర్‌బాబా సమాధి



మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25న పూనేలో జన్మించారు. మెహెరాబాద్‌కు 1923 మే నెలలో వచ్చారు. మెహెర్‌బాబా సమాధి చిన్న ఎత్తైన కొండపైన వుంది. ఈ ప్రాంగణాన్ని ఎగువ మెహెరాబాద్ అని, ప్రధాన రహదారికి ప్రక్కనే గల ప్రాంతాన్ని దిగువ మెహెరాబాద్ అని వ్యవహారికంగా పిలుస్తున్నారు. ఈ ఎగువ - దిగువ మెహెరాబాద్‌ల నడుమ డోన్ - అహ్మద్‌నగర్‌లకు వెళ్ళే రైలు మార్గం వుంది. ఈ రైలు మార్గానికి సమీపంలో మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో వినియోగించిన ఒక పోస్టాఫీసు భవనం వుంది. ఈ భవంతిలో ఓ పెద్ద హాలు, వరండా మాత్రం వుండేది. మెహెరాబాద్‌కు బాబా క్రొత్తగా వచ్చిన రోజుల్లో ఈ పోస్టాఫీసు బిల్డింగు ఒక్కటే కాస్త నివాసయోగ్యంగా వుండేది. దాంతో మెహెర్‌బాబా, ఆయన మండలి సభ్యులు ఈ భవనంలోనే వుండేవారు. బాబా తన అవతార కార్యక్రమంలో భాగంగా మెహెరాబాద్‌లో చాలాకాలం వున్నారు. ఆది 1927 ఏప్రిల్ నెలలో ఓ రోజున ఎగువ మెహెరాబాద్‌లో వాహ్యాళిగా తిరుగుతూ, ఒక ప్రదేశంలో ఆగి ఓ పెద్ద గొయ్యిని త్రవ్వమని తన మండలివారిని ఆదేశించారు. ఈ గొయ్యి ఆరు అడుగుల పొడవు, ఆరడుగులు లోతు, నాలుగు అడుగులు వెడల్పు ఉండేలా త్రవ్వారు. ఈ పని 1927 జూలై - ఆగష్టు నెలలో జరిగింది.

**బాబా తరచు ఇక్కడ ఏకాంతవాసం వున్నారు.**

ఐతే, 1927 డిశంబరు 20 న ఏకాంతవాసం ఉంటానని వెళ్ళిన అవతారుడు 1928 ఫిబ్రవరి 26 దాకా ఈ గొయ్యిలోనే ఉన్నారు. ఆ రోజుల్లో ఈ గొయ్యిగదిపై తాత్కాలికంగా

రేకులతో ఓ ఆచ్ఛాదన ఏర్పాటు చేశారు. 1930లో పోస్టాఫీసు గదిని పడగొట్టేయాలని ప్రభుత్వం తాకీదు ఇచ్చింది. ఆ ప్రాంతమంతా రైల్వే శాఖవారికి చెందుతుందని పేర్కొన్నారు. దాంతో పోస్టాఫీసును పడగొట్టేశారు. ఈ పోస్టాఫీసును పడగొట్టగా వచ్చిన రాళ్ళతో ఎగువ మెహెరాబాద్‌లో బాబా ఏకాంతవాసమున్న గొయ్యి గదిపై నేడు మనం చూస్తున్న రీతిలో గది, డోం నిర్మాణం బాబావారి ఆదేశాల ప్రకారం 1938లో చేపట్టారు. ఆ మాదిరిగా మెహెరాబాద్‌లో తొలి రోజులలో బాబా బస చేసిన పోస్టాఫీసుకు – నేటి బాబా సమాధికి మనకు తెలియని లింకు వుంది.

**Samadhi has become the divine Post office of the Avatar..**. అని బాబా ప్రేమికులు అభివర్ణిస్తారు.

ఆ రోజుల్లో మెహెర్‌బాబా ఏకాంతవాసం వుండే ఈ గొయ్యి గది రాబోయే రోజుల్లో మెహెర్‌బాబా సమాధిగా వుంటుందని ఎవరూ వూహించ లేదు.

ఆ దరిమలా 1938 ప్రాంతంలో ఓ స్విర్జలాండ్ దేశీయురాలు,

బాబా ప్రేమికురాలు, **హెలెన్ దాహమ్** అనే మహిళ బాబా సమాధిలోని ఆ ఎగుడు దిగుడు రాళ్ళపై అందమైన కుడ్య చిత్రాలను చిత్రీకరించింది.

అలాగే, సమాధికి ఉత్తరాన గల కిటికీని మూసివేసి ఒక ప్లే వుడ్‌పై

బాబా వారి చిత్రాన్ని ఆమె అందంగా చిత్రించి అలంకరించింది.

బాబా ఈ కుడ్య చిత్రాలను ఎంతగానో అభిమానించారు. ఐతే, వాటి ఆధ్యాత్మిక ప్రాముఖ్యత గురించి బాబా ఏమీ ప్రత్యేకంగా చెప్పలేదు.

ఆ తర్వాత కొంతకాలానికి ఉత్తరాన కిటికీవైపు వున్న ఫోటో తీసేసి కిటికీని తెరచి వుంచారు. అలా చాలాకాలం వుంది.

ఆ తర్వాత మెహెర్‌బాబా ఓ సందర్భంలో **రానో గెల్లీ** అనే మరో పాశ్చాత్య బాబా ప్రేమికురాలిని తెల్లని సాద్రాతో తాను కూర్చున్నట్లు వుండే చిత్రాన్ని గీయమన్నారు. నేడు ఈ చిత్రం దిగువ మెహెరాబాద్‌లో రాహూరీ క్యాబిన్‌లో అమర్చారు.

సమాధి గదిలో ఉత్తరాన గల కిటికీకి హెలెన్ అమర్చిన చిత్రాన్ని తీసివేసి మరొక చిత్రం ఏదైనా ఏర్పాటు చేయాలా? బాబా అని రానో అడిగితే.....

ఇప్పుడే కాదు... ఆ తర్వాత చూద్దాం

అని బాబా క్లుప్తంగా అన్నారు. ఆ తర్వాత 1969 జనవరి 31న భౌతిక దేహం వదిలేశాక, బాబా సమాధిలో ఉత్తర కిటికీ భాగంలో బాబా ప్రేమికులు శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి గారు తీసిన ఫోటోను వుంచారు.

ఈ ఫోటో ఫ్రేం చిత్రం బాబా సమాధిలో దాదాపు రెండున్నర దశాబ్దాలు పైగా వుంది. ఆ తర్వాత ఈ ఫోటోను సమాధి ప్రక్కనే వున్న **బాబా గదిలో** అమర్చారు. బాబా సమాధి అయిన తర్వాత ఈ ఫోటోలో బాబా మెడలో వేసి వున్న పూలహారంలో **మెహెరామాయి** రూపం దర్శనమిచ్చేది.

ఇది సమాధిలో వున్న ఫోటోలో మాత్రమే కాదు. అలాంటి ఫోటోలున్న అందరి బాబా ప్రేమికుల ఇళ్ళలో చాలా స్పష్టంగా మెహెరామాయి ముఖ భాగం కనపడింది. ఆ దరిమలా ఉత్తర కిటికీ వైపు తెల్లని సాద్రా ధరించిన అవతారుడు మెహెరాబాద్‌లో కూర్చున్నట్లు వున్న అందమైన తైలవర్ణ చిత్రాన్ని 1993 మార్చి 21న ఏర్పాటు చేశారు. ఈ చిత్రాన్ని 1933 ప్రాంతంలో పాశ్చాత్య బాబా ప్రేమికురాలు, ఎలిజిబెత్ పేటర్‌సన్, ఇటలీలో తీసింది.
బాబా సమాధిలో ఈ చిత్రం బాగుంటుందని మెహెరామాయి సూచించింది. అమెరికా దేశీయుడైన ప్రముఖ చిత్రకారుడు **చార్లీ మోర్‌టన్** ఈ చిత్రాన్ని గీసాడు. 1954, 1955 లో బాబా స్వయంగా తన ప్రేమిక బృందాన్ని ఈ ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఆ దరిమలా ఈ ప్రాంతాన్ని తన సమాధి ప్రాంగణంగా, రాబోయే 75 సంవత్సరాలలో ఓ గొప్ప యాత్రా స్థలమౌతుందని చెప్పారు.
మెహెర్‌బాబా 1969 జనవరి 31న దేహ త్యాగం చేశాక, బాబా నివాసముంటున్న మెహెరాజాద్ నుండి నేరుగా ఆయన భౌతిక దేహాన్ని ఇక్కడకు తీసుకు వచ్చారు. బాబా ప్రేమికుల దర్శనార్థం ఏడు రోజులపాటు ఉంచారు. ఆ ఏడు రోజులూ, రాత్రిం పగళ్ళు - 24 గంటలూ బాబా ప్రేమికులు అవతారుడిని దర్శించుకున్నారు. సాధారణ మానవులకు తుది శ్వాస వదిలిన కొన్ని గంటల్లోపే అంత్యక్రియలు నిర్వహించడం కద్దు. లేనిపక్షంలో మానవ దేహంలో అనేక పరిణామాలు తలెత్తి, పరిస్థితులు విపత్కరంగా వుంటాయని మనమందరకూ తెలుసు.
ఐతే, 1969 జనవరి 31 మధ్యాహ్నం 12.15 నిముషాలకు మెహెర్‌బాబా భౌతిక దేహం వదిలినా ఏడు రోజులపాటు ఆయన శరీరంలో ఎలాంటి మార్పులూ లేవు. ఏడు రోజుల తర్వాత కూడా ఆయన ముఖం చిరునవ్వులు చిందిస్తున్నట్లే ప్రశాంతం వుంది. ఆ వదనాన్ని బాబా ప్రేమికులు ఎందరో దర్శించుకున్నారు. బాబా ప్రేమికులు దేశ, విదేశాల్లో వున్నవారు ఎందరో బాబా దేహం వదిలేశారని పలు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుని హుటాహుటిన, ఉన్నఫళంగా మెహెరాబాద్‌కు బయలుదేరారు.
మేం వస్తున్నాం.. మాకు బాబా దర్శనం ఇప్పించండని టెలిగ్రాంలు ఇచ్చారు. వారి ఆవేదనలు అభ్యర్థనలు అర్థం చేసుకున్న మండలివారు, బాబా దేహాన్ని అలా ఏ రోజుకారోజు అన్నట్లు ఏడు రోజులపాటు గొయ్యి గదిలోనే వుంచారు. అప్పటికీ స్థానిక వైద్యులు తక్షణం సమాధి ఏర్పాట్లు చేపట్టాలని, లేదంటే బాబా దేహం పాడైపోగలదని హెచ్చరించారు.
కానీ, ప్రేమికుల ఒత్తిడులకే మండలి ప్రాధాన్యత ఇయ్యవల్సివచ్చింది. అమెరికా, యూరోప్ తదితర దేశాల నుండి, మన దేశంలోని అనేక మారుమూల

ప్రాంతాల నుండి ప్రేమికులు అశేష సంఖ్యలో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, తమ ప్రియతముడిని ఆనాడు దర్శించుకున్నారు. ఆనాడు అవతారుడిని దర్శించుకున్న విశేష ప్రేమిక జనవాహినిలో ఈ వ్యాస రచయిత కూడా వున్నాడు.
అప్పుడు నా వయస్సు పది సంవత్సరాలు. మెహెర్‌బాబాని సమాధిలో వుంచిన నాల్గవ రోజు నుంచి ఏడవ రోజు దాకా మా అమ్మ సుశీలా కృష్ణతో బాబా సమాధి ప్రాంగణంలో గడిపాను. అవతారుని పాద స్పర్శ, దర్శన భాగ్యం లభించింది. అనంతరం, ఏడవ రోజైన-1969 ఫిబ్రవరి 7, మధ్యాహ్నం 12.15 నిముషాలకు, మెహెర్‌బాబా భౌతిక దేహంపై ఎర్రని మృత్తిక చల్లేందుకు విచ్చేసిన బాబా ప్రేమికులందరికీ అందజేశారు. బాబా ప్రేమికులు తలా ఒక పిడికిలి చేతపట్టారు. జొరాస్ట్రియన్ క్యాలెండర్ ప్రకారం ఆ రోజు మెహెర్‌బాబా పుట్టిన రోజయ్యింది. ఇదంతా మనకు కాకతాళీయం. కానీ అవతారునికి అంతా అవగతమే.

**I AM NEVER BORN. I NEVER DIE. YET EVERY MOMENT I TAKE BIRTH AND UNDERGO DEATH. ALTHOUGH I AM PRESENT EVERYWHERE ETERNALLY IN MY FORMLESS INFINITE STATE, FROM TIME TO TIME I TAKE FORM. THIS TAKING OF FORM AND LEAVING IT IS TERMED MY PHYSICAL BIRTH AND DEATH.**

ఇది మెహెర్‌బాబా తన ప్రేమికులకు ఇచ్చిన సందేశం. ఇది అక్షర సత్యం. నమ్మినవారికి కొంగు బంగారం. కంటికి రెప్పలా తన ప్రేమికులను మెహెర్‌బాబా కాపాడతారు. నిత్యం వారి మనస్సుల్లో వచ్చే అశేష ప్రశ్నలకు క్షణంలో జవాబిస్తాడాయన. ఐతే, ఇది వ్యక్తిగతం. ప్రతివారి హృదయాల్లో వున్న మెహెర్‌బాబా, వారి హృదయాల్లో నిత్యం సంభాషించే మౌన, ప్రేమావతారుడు. దివ్యావతారుడిని నమ్మి భజియించడం, తరించడం మన పూర్వజన్మ సుకృతం. ఆ దరిమలా, 1971 నవంబరు 14, ఆదివారం రోజున బాబా సమాధిపై ఇటాలియన్ పాలరాయిని ఏర్పాటు చేశారు. ఆ పాలరాయిపై ఇలా చెక్కించారు.

**ETERNAL BELOVED**
**AVATAR MEHER BABA**
**FEBRUARY 25 1894 - JANUARY 31 1969**
**I HAVE COME NOT TO TEACH BUT TO AWAKEN**

ఆ దివ్య ప్రాంగణం **2015 జనవరి 31న** విశేష బాబా ప్రేమిక జన సందోహంతో కళ కళలాడబోనుంది. మెహెర్‌బాబా అమరతిథికి మెహెరాబాద్ విచ్చేసే బాబా ప్రేమికులందరికీ మెహెర్‌బాబా పత్రిక పక్షాన ఈ చిన్ని వ్యాసంతో, ప్రత్యేక స్వాగతం పలుకుతున్నాం. జైబాబా...

# మరాఠీ సహవాస్

## 1955 నవంబరు 27 డిశంబరు 2.

1955 నవంబరు 27వ తేదీ. ఆ రోజున మెహెరాబాద్‌లో మరాఠీ సహవాస్ ప్రారంభమైంది. అంతక్రితం జరిగిన హిందీ సహవాసీయులందరూ మెహెరాబాద్ నుండి వారివారి ప్రాంతాలకు బయల్దేరారు. వారు అలా తిరుగు ప్రయాణమయ్యాక రాబోయే మరాఠీ గ్రూపు వారి కోసం తిరిగి భోజన, బస ఏర్పాట్లులో మండలివారు నిమగ్నమయ్యారు. మరాఠీ గ్రూపులో సహవాసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీరు మొత్తం 213 మంది దాకా వున్నారు. 1955 నవంబరులో మెహెరాబాద్‌లో ఏర్పాటు చేసిన నాలుగు సహవాస్‌లలో మరాఠీ సహవాస్ చిట్టచివరిది. అందువల్ల, మరాఠీయులు కాకున్నా ఇతర ప్రాంతీయుల్ని కూడా కొంతమందిని ఈ బృందంతో పాల్గొనేందుకు అనుమతించారు. అలా మన తెలుగువాడైన శ్రీ జియస్‌యన్ మూర్తి గారు తొలిసారిగా మెహెరాబాద్‌లో మరాఠీ బృందంతో కలిసి బాబా సహవాస్‌లో పాల్గొన్నారు. బాబాను తొలిసారిగా దర్శించుకున్నారు. తదాదిగా మెహెరాబాబాకు విధేయునిగా బాబా నామవ్యాప్తిలో శ్రీ జియస్‌యన్ మూర్తి అంకితమయ్యారు. ఈ సహవాస్ ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవడానికి సహవాస్ ప్రారంభానికి రెండు రోజుల ముందుగానే బాబా స్వయంగా వచ్చి మండలివారిని అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. మరాఠీ బృందంలోని సభ్యులందరూ నవంబరు 27 మధ్యాహ్నానికి మెహెరాబాద్ చేరుకున్నారు. వారినందరినీ అహ్మద్‌నగర్ రైలు, బస్ స్టేషన్‌లు నుండి ప్రత్యేక బస్సులలో మెహెరాబాద్‌కి తీసుకువచ్చారు. విచ్చేసిన వారికి భోజన, బస ఏర్పాట్లులో, అలాగే, ప్రతి చిన్న విషయంలో రాత్రనక పగలనక బాబా మండలి ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. నవంబరు 28, ఉదయం 7.45 నిముషాలకు మెహెరాబాబా మెహెరాజాద్ నుండి కారులో మెహెరాబాద్‌కు విచ్చేశారు. సహవాసీయులందరూ బిగ్గరగా అవతార్ మెహెర్‌బాబాకి జై అని జయజయధ్వానాలు చేశారు. అనంతరం బాబా మండలిహాలులో కూర్చున్నాక విచ్చేసిన సహవాసీలు బాబా మెడలో పూలదండలు వేశారు. ఐతే ఇంతక్రితం జరిగిన తెలుగు, హిందీ సహవాసీయులు మాదిరిగా కాకుండా మరాఠీయులు మూకుమ్మడిగా బాబా మెడలో పూలహారాలు వేయడానికి ఉత్సుకత చూపారని, క్రమశిక్షణ లేకుండిందని లార్డ్‌మెహెర్‌లో అనాటి విషయాలు రాస్తూ వ్యాఖ్యానించారు. ఈ సహవాస్ సమయంలో బాబా పాదాలు తాకరాదని కఠిన నియమం వుంది. ఐనా, ఎన్నో వ్యయ భారాలను భరించి వచ్చిన వారు ఆ నియమాన్ని పాటించలేదన్నారు.

అందరూ బాబాకి విధేయతతో పాదాభివందనం చేశారు. పూలహారాలు వేసేటప్పుడు బాబా తన సహజ ధోరణిలో చతురోక్తిగా అందరినీ నవ్వుతూ పలకరించారు.
బాబా ప్రేమికుడు డాక్టర్ సిడి దేశ్‌ముఖ్ బాబా మెడలో పూలహారం వేశాడు. ఐతే అది తిరగేసి వుంది. డాక్టర్ సిడిని చూపిస్తూ...ఇదిగో ఈతడు యూనివర్శిటీలో గొప్ప ప్రొఫెసర్. పూలదండ వేయడం మాత్రం చేతకాదంటూ, బాబా తన మెడలో దండను తీసి తిరిగి సరిగ్గా వుండేలా వేయమన్నారు. దీంతో మండలిహాలులో నవ్వులు పూశాయి.
మరో బాబా ప్రేమికుడు, రామచందర్ గాడేకర్ పెద్ద పూలదండను తీసుకువచ్చాడు.
బాబా అతని చేతిలో పూలదండను చూసి, ఏమయ్యా..నాపై దయ లేదా?
అంత బరువైన దండ నా మెడలో వేస్తే నేనేం కావాలన్నారు.
పూలదండ ఎంతపెట్టికొన్నావని బాబా అడిగితే, ఓ పది రూపాయలు మాత్రమే బాబా అనడంతో....తిరిగి మండలిహాలులో నవ్వులు విరిసాయి. ఆ తర్వాత బాబా సోఫాలో కూర్చుని తన కాళ్ళు ముందుకు జాపారు. తెల్లని తువ్వాలు వంటిది బాబా కాళ్ళపై వుంచారు. ఇకపై పూలదండలు తెచ్చినవారిని బాబా పాదాల వద్ద వుంచమన్నారు.
ఆ తర్వాత మౌనీ బాబా అనే ప్రేమికుడు బాబాకు పూలదండ సమర్పించుకున్నాడు.
ఈతడిని బాబానే స్వయంగా కొంతకాలం మౌనంగా వుండమని ఆదేశించారు.
ఐతే, ఈ సహవాస్ నుండి తిరిగి మాట్లాడమని, మౌనం విడనాడమని ఆదేశించారు.
ఆ తర్వాత చాలాకాలం తర్వాత బాబా దర్శనార్థం వచ్చిన ఒక ప్రేమికుడిని దగ్గరగా తీసుకుని అతడికి తన ఆలింగన భాగ్యం ఇచ్చారు. ఇది చూసి ఢిల్లీ నుంచి వచ్చిన ఒక ప్రేమికుడు తనకూ ఆలింగనం ఇవ్వమన్నట్లు బాబా ఎదుట నిలుచున్నాడు.
దాంతో బాబా అతనికి చివాట్లు పెట్టారు. నీవు నా ఆలింగనం ఆశించడం భావ్యం కాదన్నారు. సహవాస్‌లో నేను అందరికీ ఆలింగనం ఇస్తున్నానా? అని ప్రశ్నించారు.
మరో ప్రేమికుడు అబ్దుల్ మాజిద్ ఖాన్ పెద్ద పూలదండలతో బాబా ఎదుటకు వచ్చాడు. బాబా అతడిని చూస్తూనే, ఏమి అంత బక్కపల్చగా తయ్యారయ్యావని, ఆరోగ్యం ఎలా వుందని వాకబు చేశారు. ఆపై బాబా సంజ్ఞలతో తన సందేశం ఇవ్వడం ప్రారంభించారు. సహవాసీలను ఉద్దేశించి బాబా మాట్లాడుతూ, మీరందరూ ఇక్కడ ఐదు రోజులు వుంటారు. ఇక్కడ వున్నన్ని రోజూలూ హాయిగా, ప్రశాంతంగా వుండండి. ఏడుపు వచ్చినా, నవ్వు వచ్చినా హాయిగా ఎలాంటి అరమరికలు లేకుండా నువ్వుకోండి. పూలదండల కోసం డబ్బు వృధా చేసుకోకండి. రేపటి నుండి పూలదండలు ఎవ్వరూ తీసుకు రావద్దు. నాకు రెండే రెండు గులాబీ రంగు కోట్లు వున్నాయి.
ఈ రోజు మీరు వేసిన పూలదండలతో ఈ కోటు తడిసి ముద్దయ్యింది. ఈ పూలదండలు ఎక్కువకాలం వుండవు. అలాగే, ప్రతిసారీ అవతార్ మెహెర్‌బాబాకి జై అని కూడా బిగ్గరగా నినాదాలు చేయకండి. మీ మనస్సులో నా ఎడల ప్రేమ వుండాలి కానీ,

బిగ్గరగా నినాదాలు వృధా అన్నారు. నినాదాలు మీ మనస్సులో చేసుకోండి. మీ హృదయానికి ఆ నినాదాలు వినపడాలి కానీ ఇతరులకు కాదన్నారు. బిగ్గరగా నినాదాలు చేయడం వల్ల ఎలాంటిప్రయోజనం వుండదన్నారు. ఈ రోజు, రేపు ప్రధానంగా నాలుగు విషయాలపై వివరంగా ప్రస్తావిస్తాను. ఇంతక్రితం జరిగిన గుజరాత్, హిందీ, తెలుగు సహవాస్‌లలో కూడా అవే విషయాలు చెప్పాను. మెదటి రెండు రోజులు ఆ విషయాలను చెప్తాను. తొందరేమీ లేదు. చిన్నగా చెప్పుకుందాం. నేను చెప్పేదాన్ని శ్రద్ధగా వినండి. ఆలకించండి. నేను చెప్పేదాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. నేను చెప్పేది చిన్న విషయం కావచ్చు. లేదా గంభీరమైనదైనా కావచ్చు. శ్రద్ధగా విని, అర్థం చేసుకోండి. అర్థం చేసుకోలేక పోయినా శ్రద్ధగా ఆలకించండి. వినండి. నా మాటలు వినడం వల్ల మీకు వచ్చే నష్టం ఏమీ వుండదు. నేను ఈ రోజు చెప్పే విషయాలు వినడం వల్ల ఈ రోజు కాకపోయినా, కొన్ని సంవత్సరాల తర్వాతనో, లేదా కొన్ని జన్మలెత్తిన తర్వాతనైనా మీకు అర్థమౌతుంది. నేను చతురోక్తులుగా చిన్ని విషయాలు చెప్పినా, గంభీరమైన ప్రసంగంతో గొప్ప సందేశం ఇచ్చినా శ్రద్ధగా ఆలకించండని తొలి సమావేశంలోనే సహవాసీలను బాబా హెచ్చరించారు. ఉపాసనీ మహారాజ్ ఆశ్రమం, సాకోరీ నుండి వచ్చిన యశ్వంతరావ్ కేసి బాబా చూస్తూ....నేను చెప్పింది వింటున్నావా? అని ఆతడ్ని అడిగారు. నేను వింటున్నాను బాబా అని యశ్వంతరావ్ జవాబిచ్చాడు. యశ్వంతరావ్ నాకు చాలాకాలంగా తెలుసు. నాకు చిరపరితుడని బాబా ఆతడిని పరిచయం చేశారు. ఈ ఐదు రోజుల సహవాస్‌లో మీ ఇంటి దగ్గర విషయాలన్నీ వదిలిపెట్టి నా సమక్షంలో నేను చెప్పేది శ్రద్ధగా ఆలకించండి. భౌతికంగా, మానసికంగా అన్నీ మరచిపోయి నా సమక్షంలో హాయిగా వుండండి.

ఇదొక అరుదైన అవకాశమన్నారు. బాబా సంజ్ఞలతో చెప్పే మాటల్ని బాబా ప్రేమికులైన ఢాకేపాల్కర్ మరాఠీలోను, ఏరుచ్ జెస్సావాలా ఇంగ్లీషులోనూ తర్జుమా చేస్తున్నారు. మరేదైనా భాషలో తర్జుమా అవసరమా అని అడిగితే, సహవాసీలు అవసరం లేదన్నారు. ఇకపై నేరుగా తాను చెప్పదల్చుకున్న విషయానికి వచ్చేస్తానంటూ బాబా ఇలా అన్నారు. ఆధ్యాత్మిక మార్గాన్ని తెలుసుకుని, అర్థం చేసుకోవాలనుకోవడం చాలా కష్టం అన్నారు. అలాగే, ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుని, ఆ మార్గాన్ని అనుసరించాలనుకోవడం ఇంకా చాలా కష్టం అని బాబా స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక విషయాల గురించి తెలుసుకోవాలనుకునేవారికి అనేకమంది రాసిన గ్రంధాలు వందలు వేల సంఖ్యలో వున్నాయి. అంతెందుకు, ఆధ్యాత్మికమార్గ విశిష్టత గురించి తెలియజెప్పేందుకు ఎందరో సాధువులు, సన్యాసులు, ప్రవచనకారులున్నారు. ఈ విషయమై ప్రవచనాలు ఇచ్చేవారి సంఖ్యకు కొదవేమీ లేదన్నారు బాబా. ఐతే, ఆధ్యాత్మిక మార్గమనేది మానవ మేధకు

అతీతమైనది. అంత సులువైన విషయం కాదన్నారు. గాడ్ స్పీక్స్...భగవద్వచనం గ్రంధంలో అనేక ఆధ్యాత్మిక విషయాలను ఆమూలాగ్రం వివరించడమైందన్నారు. మానవజన్మ పరిణామక్రమం మొదట్నుంచి చివరిదాకా కూలంకషంగా ఆ గ్రంధంలో వివరించానన్నారు. భగవద్వచనం గ్రంధాన్ని ఆసాంతం, ఆమూలాగ్రం, మొదటి పేజీ నుంచి చివరిదాకా ఔపోసన పట్టినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. భగవద్వచనం లాంటి అనేక ఆధ్యాత్మిక గ్రంధాలు చదివి అర్థం చేసుకోవడం ద్వారా మానవజీవిత లక్ష్యమైన బ్రహ్మైక్య సాధన సాధ్యం కాదన్నారు. అంతేకాదు, ఈ గ్రంధాలు పఠనం వల్ల కనీసం భగవంతుని సాన్నిధ్యం కూడా లభించదని బాబా స్పష్టం చేశారు. కేవలం గ్రంధాలు చదవడం, లేదా శ్రద్ధగా ఆలకించడం, భజనలు, జపతపాలు వంటివి చేయడం ద్వారా ఆధ్యాత్మిక మార్గాన్ని చేరలేరని బాబా అన్నారు.

నేను నా దివ్యాధికారంతో చెబుతున్నాను. ఈ పనులన్నింటివల్ల మరింత సంస్కార బంధానాలలో ఇరుక్కుంటారు తప్పించి మరి ఇతర ప్రయోజనం ఉండదన్నారు. తలక్రిందులుగా తపస్సు చేసినా, కఠోరమైన ఉపవాసాలున్నా, పెద్ద రాతికొండను ఢీకొని తల బ్రద్దలు కొట్టుకున్నా, అవేవీ మిమ్ముల్ని ఆధ్యాత్మిక మార్గాన్ని చేర్చలేవు అని బాబా అన్నారు. ఆధ్యాత్మిక మార్గాన్వేషణలో ఒకవేళ మీరు కఠిన ఉపవాసం వున్నారనుకుందాం. దీనివల్ల వచ్చే లాభం కంటే నష్టమే ఎక్కువగా వుంటుంది. ఉపవాసం వుండటంతో మీ మనస్సు పరిపరివిధాల పరిభ్రమిస్తుంది.

మీ మనస్సు వల్ల సంస్కారాల ప్రోది అధికమవుతుంది. అంతెందుకు, మీరేం చేసినా..అంటే పడుకున్నా, మెళుకువగా వున్నా, నడుస్తున్నా, గాలి పీలుస్తున్నా కూడా సంస్కారాల బంధానాలు ఏర్పడతాయి. ఈ సంస్కార బంధనాలు ఎల్లవేళలా వుంటాయి. త్రికాలాలలో వున్నాయి. వాటి నుండి మీరు తప్పంచుకోలేరు. ఐతే ఇందుకు తగిన జవాబు నేను చెబుతానని బాబా ఇలా చెప్పడం కొనసాగించారు.

ఈ సంస్కార బంధనాలలో చిక్కుకోవడమనేది స్వయంకృతమే. మీ చేతులారా మీరు ఈ బంధనాల వలలో పడుతున్నారు. ఇందుకు మూడు పరిష్కార మార్గాలున్నాయి. ఇక్కడ సహవాస్‌లో కూర్చున్న మీ అందరికీ మీ చుట్టుప్రక్కల సహవాసీలు, తగినంతమంది జనులు, సమాజం వుంది. ఇదంతా ఎందువల్ల అంటే, మీలో 'నేను' అనే భావం వల్ల మీ చుట్టుప్రక్కల వున్న సమాజం యొక్క ఉనికి ఉంది.

నేను ఫలానా.. నేను ఫలానా..ఫలానా వాడినన్న భావం వల్ల మీకు చుట్టుప్రక్కల వున్నవారందరూ కనిపిస్తున్నారు. అదే, గాఢ నిద్రలో వున్న సమయంలో ఇప్పుడు మీకు కనిపిస్తున్న వారెవరూ కనిపించరు కదా!! మీ గాఢ నిద్రా సమయంలో మీకు నేను అనే భావన లేదు. అదే నిజమైన భగవంతుని స్థితి. ఎవరికైనా ఆ స్థితిలో నేను అనే ఎరుక, చైతన్యం వుండదు. తిరిగి మెళుకువ రాగానే... ఈ ద్వంద ప్రపంచం

యావత్తూ తిరిగి కనిపిస్తుంది. తన చుట్టుప్రక్కల వున్న మందిమార్బలం అందరూ తిరిగి కనిపిస్తారు. ఎందువల్ల అంటే, నిద్ర నుండి లేవగానే, మీతో పాటు మీలోని సంస్కారాలు కూడా నిద్రలేస్తాయి. గాఢనిద్రలో వున్న సమయంలో ఇవేవీ మీకు పట్టవు. మీలో నేను అనే ఎరుక వుండదు. ప్రతిరోజూ జరుగుతున్న తంతు ఇది. కానీ మీరు నిశితంగా గమనించ లేదు. ఐతే, మీకు కావల్సింది ఏమంటే, ఆ గాఢ నిద్రలో మీరు చైతన్యంగా వుండాలి. గాఢనిద్రలో మానసికంగా కళ్ళు తెరుచుకుని, భగవంతుని సాన్నిధ్యం ఆశిస్తూ గడపడం ద్వారా నీవూ-భగవంతుడు వేరు కాదు అనే అనుభవం మీకు లభిస్తుంది. ఐతే ఇది చాలా కష్టమైనది. దుర్లభం కూడా. ఎందువల్ల అంటే, మీలో వున్న నేను అనే భావన పూర్తిగా నశించకపోవడం వల్ల అని బాబా స్పష్టం చేశారు. భగవంతుడు మీ శ్వాసకన్నా దగ్గరగా వున్నాడు. శ్వాస తీసుకోవడం నిలిపివేస్తే శరీరం మరణించిందని ప్రకటిస్తారు.
గాఢనిద్రలో కూడా, మీరెవరో, మీకు తెలియని సమయంలో కూడా మీ శ్వాస ఆగదు. మీరు గాలి తీసుకుంటూనే వున్నారు. కానీ మీకావిషయం తెలియదు. అలాగే ఈ విషయాన్ని కొనసాగిస్తే, ఆవులిస్తూ...మీ యదార్థ స్థితిలోకి, మీరెవరో తెలియని గాఢనిద్రలోకి జారుకుంటారేమో అని చలోక్తిగా నవ్వించి..
బాబా ఇలా చెప్పడం కొనసాగించారు.
మీరు అనుక్షణం గాలిపీల్చి వదిలి పెడుతున్నా అది మీకు తెలియదు.
మీకు తెలియకుండానే మీ శ్వాస ప్రక్రియ జరిగిపోతోంది.
వేగంగా పరిగెడితే, మీ గుండె కొట్టుకోవడం, రొప్పుతూ గాలిపీల్చడం వంటిది మీకు అనుభవంలోకి వస్తుంది. అప్పుడు మీరు గాలి తీసుకుంటున్నారనే అనుభవం వుంటుంది. సాధారణ సమయంలో మీ శ్వాస గురించి ఏమాత్రం పట్టించుకోరు. అదేమాదిరి, భగవంతుడు ఎల్లవేళలా మీకు అత్యంత దగ్గరగా వున్నాడు. మీరు ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాశం మీకు పట్టకపోయినా అవి నిరంతరం జరిగిపోతున్నట్లు, మీకు తెలియకపోయినా, మీకు ఎరుక లేకపోయినా, చైతన్యం లేకపోయినా, భగవంతుడు మీ వెంటనే, మీ తోడుగా వున్నాడు. అది మీరు గమనించరు. నీటిలో మునిగిపోతుంటే మీరు తీసుకునే శ్వాస, గాలి గురించి మీకు తెలుస్తుంది. అలాగే, భగవధ్యానంలో, భగవస్మరణలో నిండుగా మునిగితే ఆ భగవంతుని ఎరుక సంపూర్ణంగా అనుభవంలోకి వస్తుంది. ఇందుకోసం ఎన్ని మాటలు చెప్పినా తక్కువే అవుతాయి.
ఆ నిజమైన స్థితిని ఎవరికివారు అనుభవించాలి.
ఆ దివ్య సముద్రుని ప్రేమలో ఓలలాడాలి అని బాబా శెలవిచ్చారు.

**- సశేషం**

# భైరమంగళ

భైరమంగళ 76వ వార్షికోత్సవం 2015 డిశంబరు 13న వైభవంగా జరుపుకొన్నట్లు శ్రీ దేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుండి బాబా ప్రేమికులు సుమారు 150 మంది హాజరయ్యారు. శ్రీమతి ఫ్రేనీ నాలావాలా సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. ముందుగా పురవీధులలో నగర సంకీర్తన జరిగింది. బేబి మెహెర్ సుమన, బేబి మెహెర్ గీతిక చక్కని నృత్య ప్రదర్శనలు చేశారు. మెహెర్ విభ (7) ఏకపాత్రాభినయంతో బాబా సందేశాన్ని చక్కగా ప్రదర్శించింది. శ్రీ రఘుపతిరావ్ భైరమంగళలో బాబా నెరపిన కార్యక్రమం గురించి, భైరమంగళలో 1983 లగాయితు చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై శ్రీ వి. దేవరావు,, కార్యదర్శి, శ్రీ యం.వి.ఆర్.కె. బాలాజి, హైదరాబాద్ తదితరులు వివరించారు.

# కామారెడ్డి

అవతార్ మెహెర్‌బాబా 122వ జన్మదినోత్సవాలు సందర్భముగా అక్టోబరు 27 నుండి ఫిబ్రవరి 25 వరకు 122 రోజులు ప్రతిరోజు ఉ. 5 గం.ల నుండి 6 గం.ల వరకు నగర సంకీర్తన జరుపుచున్నాము. ఈ కార్యక్రమానికి పిల్లలు, పెద్దలు అందరూ కలిసి 100 నుండి 120 వరకు హాజరవుతున్నట్లు అధ్యక్షులు శ్రీ ఎల్లంకి రాజేశం ఒక ప్రకటనలో తెలిపారు.

# చెన్నై వరద బాధితులకు సహాయం

చెన్నై వరద బాధితుల సహాయ కార్యక్రమము 2016 జనవరి 1న వినోభా హాల్‌లో నిర్వహించినట్లు శ్రీనిబాబు చెన్నై ఒక ప్రకటనలో తెలిపారు.
చెన్నై బాబా ప్రేమికులు ముఖ్యంగా శ్రీ కుబేరరాజు, శ్రీ కె. రాజగోపాల్‌తో పాటు కళారంజని మ్యూజిక్ స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. “సచ్చితానంద పరమానంద” బాబావారి దివ్య నామ సంకీర్తనల నడుమ హాజరైన బాధితులందరికీ 15 కేజీల బియ్యం 20 రకాల వంట సరుకులు, ఏబది ఒక రూపాయి దక్షిణతో ఇవ్వడమైంది. బాబావారి చిత్ర పటములు బాధితులందరికీ అందజేయడమైంది. తెలుగు ప్రాంతంలోని బాబా ప్రేమికులు రూ. 1.50 లక్షలు సేకరించి విరాళాలు అందజేసినట్లు శ్రీనిబాబు తెలిపారు.



# నివాళి

మా తల్లిగారు శ్రీమతి సుశీలాకృష్ణ (1999 జనవరి 4) - అలాగే ఆమెకు తమ్ముడు, మా మేనమామ మెహెర్‌బాబా పత్రిక వ్యవస్థాపకులు, శ్రీ దశిక ప్రసాదరావు (2004 జనవరి 24) బాబాలో ఐక్యమయ్యారు. వారిని 2016 జనవరి సంచిక ద్వారా స్మరించుకుంటున్నాం.



మా తల్లి- సుశీలా కృష్ణ స్వీయ రచనలో వెలువడిన చక్కని పాట **“నిన్ను మరచి ఉండ లేనయ్యా”** అని అవతారుడిని ఆమె స్మరిస్తూ ఆలాపించే కీర్తనను, ఆమెను స్మరించుకుంటూ ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించగలరు.

**- ఎడిటర్**

**భూలే బిసరే గీత్**

## “నిన్ను మరచి ఉండ లేనయ్యా”

నిన్ను మరచి ఉండ లేనయా,
పింపలవాసా, నిన్ను మరచి ఉండలేనయా,
నిన్ను మరచి ఉండలేను, కన్న తండ్రివగుటచేసి,
ఎన్న బోకు చేసిన నేరములను,
షిరీను కుమార మెహెరు బాబా ॥నిన్ను॥

సర్వమునకు కర్త నీవె,
సర్వమునకు భోక్త నీవె,
సర్వమునకు ఆర్త నీవు,
పరమ పురుష మెహెరు బాబా... ॥ నిన్ను॥

పూనా వాస మెహెరు బాబ,
నీవె నీడ మాకు బాబా,
కావుమయ్యా శరణు, శరణు, దేవ, దేవ.
మెహెరు బాబా... ॥ నిన్ను॥

# శీతల చరణం



శీతల చరణం- కోమల చరణం
మధుర చరణం- మెహెరు చరణం ॥శీ॥

మెహెరు చరణం పరమ శరణం
పాప హరణం - భవ తరణం ॥శీ॥

చరణ స్మరణం - జ్ఞాన స్ఫురణం
మాయా మరణం - జాగరణం ॥శీ॥

**- శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి**

# నరసరావుపేట

నరసరావుపేట బాబా సెంటర్‌లో 2016 జనవరి 4న, తిరిగి జనవరి 16న ప్రత్యేక సత్సంగ్, పేదలకు అన్నదానం నిర్వహించామని, బాబా ప్రేమికులు శ్రీ వంకాయల అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి మల్లాది సుశీలా కృష్ణ, శ్రీ గోపాలకృష్ణమూర్తి గార్ల స్మృత్యర్థం వారి కుమారుడు మల్లాది రామారావు, న్యూ ఢిల్లీ, గారి కోరిక మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. శ్రీ మల్లాది వారు ఉద్యోగరీత్యా 1965లో నరసరావుపేటకు వచ్చి అక్కడే సుమారు దశాబ్దంపైగా వున్నారు. స్థానిక బాబా ప్రేమికులు శ్రీ నాగసరపు రామచంద్రరావు గారి ద్వారా వీరు మెహెర్‌బాబా పరిధిలోకి వచ్చారు. అనంతరం, మెహెర్‌బాబా వీరి ఇంటి ఇలవేల్పయ్యాడు. మెహెర్‌బాబా మహిళా సెంటర్‌ను వీరి ఇంట్లోనే నెలకొల్పి, అవతారుని నామవ్యాప్తికి కృషి చేశారు. 1969 జనవరి 31న బాబా భౌతిక దేహ త్యాగం చేసిన నాల్గవ రోజున శ్రీమతి సుశీలా కృష్ణ బాబాని దర్శించుకున్నారు. అవతారుని కీర్తనలు చక్కగా ఆలాపించేదామె. కమనీయమైన గాత్రం ఆమె సొంతం. అనుక్షణం అవతారుని నామస్మరణలో గడిపిన వీరు ధన్యులు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

మరి బాబావారు ఇంకో దేశంలో కూడా ఇలాగే చేస్తారా!
తమ దైవీ సందేశం మాటలకే పరిమితంకారని నిరూపిస్తారా!.
ఈ ప్రశ్నలకి అడగకుండానే బాబావారే జవాబు చెప్పారు.
ఈవాళ ఇక్కడ, ఇప్పుడు చేసిన పరిశుద్ధి ఇంక ఎక్కడా, ఎప్పుడూ చేయమని ఘంటాపథంగా చెప్పారు. దుజ్‌దాబ్ నుంచి క్వెట్టాకి వారానికి రెండు రైళ్ళున్నాయి. ఒకటి గురువారం వెడుతుంది. రెండోది ఆదివారం నడుస్తుంది. పరిష్యాలో ఇదే ఆఖరిస్టేషను. ఈ ఊరు దాటితే బ్రిటీషు ఇండియాలో అడుగుపెట్టినట్లే.
కానీ అది ఏమంత తేలిక పని కాదు. ఇండియా రావడానికి అనుమతి పత్రం - వీసా కావాలి. అది ఓ పట్టాన దొరకదు. గవర్నమెంటు ఆఫీసు చుట్టూ పదే పదే ప్రదిక్షణ చేస్తే, ఎప్పటికో కరుణిస్తారు, కరుణామయుడయినా, నిర్దయుడయినా ఒక్కటే సర్కారువారికి. కాబట్టి వీసాల కోసం వెంటనే ప్రయత్నించమని రావ్‌సాహెబ్‌కీ, ఛగన్‌కీ బాబావారు చెప్పారు. ఆదివారం ట్రయిన్ పట్టుకోలేకపోతే నెలరోజులు ఇక్కడే జాగారం చేయాల్సివస్తుందని హెచ్చరించారు. మనం వేగిరం వెళ్ళాలి ఇండియాకి.
ఈ వేళ వీసా ఆఫీసుకు వెళ్ళండి, మీరేం చేస్తారో చేసి సకాలంలో వీసా కావాలి మనకు అని చెప్పారు. అలా వాళ్ళిద్దరూ వీసా ఆఫీసుకి వెళ్ళారు. బువాసాహెబ్‌కి ఓ పని పురమాయించారు. ఊళ్ళోకి వెళ్ళి, ఓ మంచి కుర్రాడిని తీసుకురా అన్నారు. మెహెరాశ్రమం రోజుల నుండి కూడా బాబావారు ఎక్కడికి వెళ్ళినా వారి వెంట ఓ కుర్రాడు వుండేవాడు. ఆ చిన్నారికి బాబావారే స్నానం చేయించేవారు. బట్టలు తొడిగేవారు. గోరుముద్దలు తినిపించేవారు. కొద్దిరోజుల అయ్యాక వాడిని ఇంటికి పంపేవారు. ఇలా ఒకరోజా, రెండు రోజులా, దాదాపు ఇరవై ఎనిమిది ఏళ్ళు చేశారు. మరి మండలివారు బాబావారు కోరినట్లు మంచి కుర్రాడిని తీసుకువచ్చేవారా? బాబావారి విశ్వ కార్యక్రమానికి ధీటైన కుర్రాడు దొరికేవాడా? ఎందెందు వెదికినా అందెందు కన్పిస్తాడు పరాత్పరుడు. కానీ పరాత్పరుడికి నచ్చే మంచి కుర్రాడు కనబడేవాడు కాదుట. ఒకరోజా, రెండు రోజులా, సంవత్సరాల

తరబడి వెదికినా దొరకలేదుట. ఎందుకో తెలుసా? బాబావారికి కావల్సింది తమలా వుండే కుర్రాడు. ఈ మాట బాబావారే స్వయంగా చెప్పారోసారి. నావంటి కుర్రాడు కావాలి. ఎక్కడ వెదికినా దొరకలేదు అని అంటూ, తమ చిన్నప్పటి ఫోటోని ముద్దుపెట్టుకొన్నారు. బువాసాహెబ్ గారు గాలించగా, గాలించగా ముగ్గురు కుర్రాళ్ళు దొరికారు దుజ్దాబ్ నగరంలో. వాళ్ళని చూస్తూనే బాబావారు పెదవి విరిచారు. తమ పనికి సరిపోరు అన్నారు. అయినా వాళ్ళకి కొత్తబట్టలు ఇచ్చారు. భోజనం పెట్టారు. ఇంటికి పంపేశారు. ఇది బువాసాహెబ్‌కి కొత్త అనుభవం కాదు. చాలాసార్లు జరిగింది ఇలా. అందుకనే వుండబట్టలేక మనస్సులో మాట అనేశాడు. నావల్ల కాదు బాబా. ఎంతో వెదికి వెదికి తీసుకువస్తాను ఓ కుర్రాడిని. వాడు మంచివాడులా కనిపిస్తాడు నాకు. అందుకే తెస్తాను మీ దగ్గరకి. మీకేమో ఎవరూ నచ్చరు అన్నాడు. బాబావారు రెండు అక్షింతలు వేశారు. నువొక అడవి మనిషివన్నారు. పోకిరీ కుర్రాళ్ళను తెస్తే నేనేం చేయాలన్నారు. నువ్వో పశువ్వి, అందుకనే నీలాంటి పశువులనే పట్టుకువస్తావు. బిచ్చగాళ్ళని చూపించి, మంచి కుర్రాళ్ళు అంటావా? సిగ్గులేదూ! అంటూ చురకలు వేశారు. కొంచెం ఘాటుగానే బువాసాహెబ్‌కి చుర్రున కోపం వచ్చింది. లేచి నిలుచున్నాడు.

**బువాసాహెబ్:** మహాప్రభో, నాకు దేముడూ వద్దు, గీముడు వద్దు. మీతో వేగలేను. నాదారిని నేపోతాను.

**మెహెర్ ప్రభువు:** ఎక్కడికి పోతావు. నేను లేనిచోటు చూపించు. ఎక్కడికి పోయినా నేనక్కడ వుంటాను. ఫో! ఎక్కడికయినా ఫో. నామాట నిజమని నీకే తెలుస్తుంది. ఇందుగలడు అందులేడని సందేహమువలదు. సర్వోపగతుడు ఎందెందు వెదికినా అందందే కలడు అని ప్రహ్లాదు ఊరికనే అన్నాడా? బాబావారి మాటల్తో బువాసాహెబ్‌కి బుర్ర తిరిగింది. తప్పు తెలిసివచ్చింది. అరే! నోరు జారానే అని కొట్టుకుపోయాడు. లెంపలు వేసుకొన్నాడు. కష్టం చెప్పి గట్టెక్కించమని ప్రార్ధించాడు. ఇంకో మాట అన్నాడు. మీ చురకలు భరించడం నావల్ల కాదు బాబా. మీరు విసిగిస్తారు. ఏడిపిస్తారు. కాస్తంత దయ చూపండి ఈ దీనుడిపై అని విన్నవించుకొన్నాడు. బాబావారు చిరునవ్వు నవ్వారు. నేనేం చేయను. నువ్వు కోపం తెప్పిస్తావు. నాకు కోపం వస్తుంది అన్నారు. బువాసాహెబ్ నోరు వెళ్ళబెట్టాడు. ఇదేమి మాట ప్రభూ. నేను మీకు కోపం తెప్పించడమేమిటి అని ప్రశ్నించాడు. బాబావారేమన్నారో తెలుసా? అకారణంగా కోపం తెచ్చుకొంటానా అని ఎదురు ప్రశ్నవేశారు. తమకి అతనిపై కోపం లేదని స్పష్టం చేశారు. నువ్వు చేసే పనులు కోపం తెప్పిస్తాయని పేర్కొన్నారు.

నాకు కోపం వస్తే ఏంచేయాలి. నన్ను శాంతింపచేయాలి.
మరి నువ్వాపని చేస్తావా? అబ్బే! అదేం చేయవు. ప్రతి చిన్నదానికీ అలుగుతావు.
ముభావంగా కూర్చొంటావు. నేను బుజ్జగిస్తేనే అలకపాన్పు దిగుతావు.
ఇదీ నువ్వు చేస్తున్న నిర్వాకం. మరి నాకు కోపం వస్తుందంటావా రాదంటావా చెప్పు
అని నిలదీశారు. నా సేవ నీ విధి. నీ ధర్మం. కానీ నువ్వేంచేస్తున్నావ్.
నువ్వు నన్ను సేవించడంపోయి నీ సేవనే చేస్తున్నాను. ఇది ధర్మమేనంటావా?
ఇందుకే నాతో ఎందుకు వుంటున్నావు అని గదమాయించారు.
తమ పని విలక్షణమైందని మరోసారి చెప్పకనే చెప్పారు.
నా పని మిమల్ని గాయపరచడం. ఆ పుండును పెరిగి పెద్దది చేసి మనోనాశనం
చేయడం. కానీ మీరేం చేస్తున్నారు. పుండు చూసి బెదరిపోతున్నారు.
చిందులు వేస్తున్నారు. నన్నేం చేయమంటారు.
మీరు చిందులు వేస్తారని గాయం చేయవద్దంటారా? చెప్పండి! అని అడిగారు.
బువాసాహెబ్ వంచిన తల ఎత్తలేదు. సిగ్గువేసింది.
బాబావారి మాటలు వింటున్న మండలివారికి కూడా తమ తప్పు తెలిసివచ్చింది.
మనం సేవిస్తున్నది అవతారుడిని. ఎన్నో జన్మల పుణ్యం వల్ల మనకి దొరికిందీ
భాగ్యం. ఇహమీదయినా జాగ్రత్తగా వుండాలి అనుకొన్నారు.
మళ్ళీ ఈ తప్పు చేయకూడదనుకొన్నాడు.
మీ మనోగతం నాకు తెలుసులే అన్నట్లు బాబావారు మరో సంగతి చెప్పారు.
కోపంతో ఊగిపోతూ గెంతులు వేస్తుంటే మిమ్మల్ని శాంతిపచేస్తున్నానన్నారు.
ప్రతి చిన్న విషయం మీ బుర్రకెక్కాలని విడమరచి చెప్తున్నానన్నారు.
ధైర్యం నూరిపోస్తున్నానన్నారు. ఇదంతా ఎందుకుచేస్తున్నాను.
నా గాయాన్ని తట్టుకొని మీరు నిలబడాలి,
అందుకనే. కానీ మీరేం చేస్తున్నారు.
కస్సు బుస్సంటున్నారు. నా కృప కావాలి మీకు.
కానీ మీ తీరు దాష్టీకంగా వుంది అని విశదం చేశారు.
దురహంకారం తెచ్చే అనర్థాలను వివరించారు.
నా కృప మీపై పడకుండా అడ్డుకొంటుంది దురహంకారం అని హెచ్చరించారు.
బాబావారి ఉవాచతో బువాసాహెబ్ శాంతించాడు.
నాసిక్ వెళ్ళాక నీకో పని అప్పగిస్తాను. అది ఏమిటో తెలుసా?
నా అవసరాలు జాగ్రత్తగా గమనించడం.
గది దగ్గరే ఎప్పుడూ వుండటం. నేనేమో ఏకాంతవాసంలో వుంటాను.
నువ్వేమో నా గది ముందు కూర్చొంటావు.

రాత్రి పగలు ధూపం వేస్తుంటే వుక్కిరిబిక్కిరి అవుతావు అని బాబావారు అంటుంటే, మండలివారు ఫక్కున నవ్వారు. మన బువా గారు బుంగమూతి తీసి వాళ్ళ నవ్వుతో జతకలిపాడు. వాతావరణం తేలికపడింది. పరిష్యా నుంచి ఎకాయెకి నాసిక్‌కే ప్రయాణమట. దారిలో ఎక్కడా కనీసం క్వెట్టాలో కూడా ఆగేది లేదని బాబావారు చెప్పారు. నాసిక్ వెడుతూనే ఏకాంతవాసంలో వెడ్తామని అన్నారు.

ప్రతి ప్రయాణంలోనూ ఎవరో ఒకరికి బాబావారు చురకలు తగుల్తుంటాయి.

చురకలు వాడి పెరిగిన కొద్దీ భరించడం కష్టమవుతుంది ఎవరికయినా.

పరిష్యా యాత్రలో బాబావారి చురకలకి తరుచు బలిఅయింది మాసాజీ.

ఒక్కోసారి ఛగన్ ఎరయ్యేవాడు. సిద్ధూకీ పడింది ఈ వడ్డన.

బువాసాహెబ్‌ని తూర్పారపట్టేవారు.

ఫలానా అందుకు బాబావారికి చిరాకు వచ్చిందనీ, దెప్పుతున్నారు,

చివాట్లు పెడ్తున్నారనీ చెప్పలేము. ఏం చేసినా కోపం వస్తుంది.

ఏం చేయకపోయినా రుసరుసమంటూ అక్షింతలు వేస్తారు.

ఇలాగేనా సేవించేది అని ఎద్దేవచేస్తారు.

ఎందుకు వస్తుంది బాబావారికి కోపం, చిరాకు పడ్తారెందుకు,

దెప్పుతారు, సాధిస్తారు ఎందుకని.

అకారణంగా మెహెరీశుడు ఏపనీ చేయరని మన అందరికీ తెలుసు.

మండలివారికీ తెలుసు. చివాట్లు, ఎద్దేవా నా బాణాలు అంటారు బాబా.

ఈ బాణాలు మిమల్ని కప్పిన దట్టమైన మాయతెరని ఛేధించుకొని

హృదయాన్ని తుగుల్తాయి. మిమల్ని తట్టి లేపుతాయి అని శెలవిచ్చారు.

బాబావారి బాణాలు తగలగానే రక్తం చిందుతుందట, అది మామూలు రక్తం కాదు.

పరబ్రహ్మ పరమాత్మ దివ్య దర్శనం కోసం తపన అది.

హృదయాంతరాళం నుంచి పొంగిపొర్లుతుంది అని వివరించారు.

ప్రతి తిట్టు దీవెన అన్నది ఇందుకేనేమో.

బాబావారి ఆరళ్ళలో ప్రతి ఒక్కరూ సేవా భావం నేర్చుకున్నారు.

యుగావతారునితో ఎలా మెలగాలో ఎలా సేవించి తరించాలో తెలుసుకొన్నారు.

నవంబరు 7వ తేదీ గురువారం నాడు ఓ ఇరానీ పెద్దమనిషి బాబావారి దర్శనానికి వచ్చాడు. ఇప్పుడు దర్శనమా? కుదరదు అన్నారు మండలివారు.

చాలా ఆశతో వచ్చావు. నీ ముఖం చూస్తూనే తెలుస్తోంది.

కానీ ఏంచేయం, ప్రభువు ఎవరికీ దర్శనం ఇవ్వడంలేదు ఇక్కడ అని చెప్పారు.

పాపం, ఆ ఇరానీ హతాశుడయ్యాడు. వచ్చిన దారినే వెనక్కి వెళ్ళాడు.

ఇతగాని పేరు దిన్యార్ ఇరానీ. ప్రభువు దర్శనం దొరక్కపోతేనేం,

ప్రభువుకి ఆనందం కల్గించే పని చేశాడు. మెహెరీశుని మెప్పుపొందాడు. శహభాష్, నా మండలివారు చేయలేని పని నువ్వు చేశావ్ అని వెన్నుతట్టారు. ఇంతకీ ఏంచేశాడు. ఆ వివరాల్లోకి వెళ్ళేముందు వీసాల గోడు చెప్పుకోవాలి. వీసాల కోసం రావ్‌సాహెబ్, బువాసాహెబ్, ఛాన్జీ శాయశక్తులా ప్రయత్నించారు. శనివారం మధ్యాహ్నం అంటే తొమ్మిదవ తేదీ మధ్యాహ్నానికి పర్షియా వీసాలు దొరికాయి. కానీ ఇండియా వెళ్ళడానికి ఇవి సరిపోవు. ఇండియన్ వీసాలు కూడా కావాలి. అవి ఇచ్చేది బ్రిటీషు దౌత్యవేత్త కార్యాలయం. ఆ వేళ శనివారం కావటంతో, ఆ ఆఫీసుని ఒంటిగంటకే మూసేశారు. బాబావారేమో ఆదివారం రైలుఎక్కాలంటున్నారు. ఇంత తక్కువ వ్యవధిలో దొరుకునా ఇండియన్ వీసా అనుకొంటూ రావ్‌సాహెబ్, ఛగన్‌లు బ్రిటీషు దౌత్య అధికారి (కాన్సల్) దగ్గరకు వెళ్ళారు. తమ గోడు వెళ్ళబోసుకొన్నారు. ఆ మహానుభావుడు యక్షప్రశ్నలు వేశాడు. మీ నాయకుడు ఎవరు? నాయకుడి పేరేమిటి? ఆయనేం చేస్తాడు? భుక్తి కోసం మీరేం చేస్తుంటారు? – ఇలా సవాలక్ష ప్రశ్నలు గుప్పించాడు. బాబావారు తమపేరు ఎవరికీ చెప్పగూడదన్న ఆంక్ష ఎప్పుడో పెట్టారు కదా. అందువల్ల రావ్‌సాహెబ్, ఛగన్‌ల ద్వయం నోరు కట్టేసినట్లయింది. అడిగిన ప్రశ్నకి సూటిగా జవాబు చెప్పండి డొంకతిరుగుడుగా కాదు అని గద్దించాడు ఆ బ్రిటీషు దొర. మనవాళ్ళు నీళ్ళు నమిలారు. ఇలా అయితే మీకు వీసాలు ఇవ్వనని హుంకరించాడు ఆఫీసరుగారు. బాబావారే ఏదో కరంగా వీసాలు వచ్చేలా చూస్తారన్న నమ్మకంతో వున్నారేమో, బ్రిటీషు ఆఫీసరుగారి ధోరణికి భయం పుట్టింది. డామిట్, కథ అడ్డం తిరిగిందని వెంటనే బాబావారి దగ్గరకి పరుగునవచ్చారు.

జరిగిన సంగతి చెప్పారు. అయ్యో అలా చేశాడా! వీసా ఇవ్వలేదా అన్నారు బాబా. సరే ఓ పని చేయండి, మళ్ళీ వెళ్ళి నచ్చచెప్పండి. ఈసారి ఇస్తాడేమో చూద్దాం. ఈపాటికి ఆఫీసు మూసేసి వుంటారు కాబట్టి అతని ఇంటికి వెళ్ళండి అన్నారు. మన మిత్రులు ఇద్దరూ బ్రిటీషు కౌన్సిల్ ఇంటికి వెళ్ళారు.

సింగడు వెళ్ళాడు, రానూ వచ్చాడు అన్నట్లు కాసేపటికే చేతులూపుకొంటూ తిరిగివచ్చారు. బాబావారు రావ్‌సాహెబ్‌నీ, ఛగన్‌నీ దులిపేశారు. ఇంకోసారి ప్రయత్నించి రమ్మన్నారు. అంటే నాలుగోసారి అక్కడికి వెళ్ళాలి. వీళ్ళు తటపటాయించారు. ఇన్నిసార్లు వెడితే, బ్రిటీషు దొర చీదరించుకొంటాడేమో? అయినా ఎన్నిసార్లు వెళ్తాం అతని దగ్గరకి. అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పకపోతే వీసా ఎలా ఇస్తాడు అతను మాత్రం. ఇదీ వీళ్ళ అనుమానం. ఈమాట చెప్పబోతే బాబావారు వినిపించుకోలేదు. నా ఇచ్ఛ ప్రకారం నడుచుకోని పక్షంలో నా దగ్గర ఉండటం ఎందుకట అదొక శుష్క దండగ అన్నారు నిష్ఠూరంగా. రావ్‌సాహెబ్ మనస్సులో మాట చెప్పేశాడు. మీకు మా కష్టం అర్థం కావటంలేదు బాబా అన్నాడు.

ఇన్నిసార్లు వెళ్ళింది మీ ఇచ్ఛ ప్రకారం కాదా అన్నాడు.

**బాబా:** ఏమిటి మీకొచ్చిన కష్టం.

**రావ్‌సాహెబ్:** మీరేమో మీపేరు చెప్పకూడదన్నారు. మీ నాయకుడి పేరు చెప్పమని ఆ దొరగారు పట్టుపడ్తున్నాడు. పేరు చెప్పకపోతే వీసా ఇవ్వరనే మాట మీకు తెలియంది ఏముంది బాబా. ప్రాపంచిక వ్యవహారాల్లో మనం నలుగురు నడిచే మార్గాన్నే వెళ్ళాలి. మీరేమో పేరు చెప్పవద్దంటారు. మీ ఇచ్ఛ ప్రకారం మీ పేరు చెప్పలేదు. దీనితోనే వచ్చింది తంటా. అయినా సరే మీపేరు చెప్పలేదు. మీ ఇచ్ఛ ప్రకారం నడుచుకొంటున్నాము కాబట్టి. రావ్‌సాహెబ్ మాటలు వింటూనే బాబావారు అగ్నిగోళమయ్యారు. మీరిద్దరూ దద్దమ్మలు. ఎందుకూ పనికిరారు అన్నారు. ప్రాపంచిక పద్దతులు మరచిపోండి. నా ఆదేశాలని గుర్తుంచుకోండి. బ్రిటీషు ఆఫీసరు మిమ్మల్ని పొమ్మన్నాడయ్యా! అయితే ఏమవుతుంది. మిన్ను విరిగి మీదపడుతుందా! అయినా నాకు తెలియదా! ఈ సంగతలు నాకు అర్థంకాదు. నేనో పిచ్చివాడిని అనుకొంటున్నారా? సులభంగా అయిపోయేపని ఎవరైనా చేస్తారు! అందులో ఏముంది గొప్ప. అసాధ్యమైన పని ఏదైనా చేయాలి! అది నా ఆజ్ఞ ప్రకారం పూర్తిచేయాలి. అప్పుడే మీకు మొగతనం వున్నట్లు అన్నారు. విధేయత గురించి పాఠం చెప్పారు. గురువు ఇచ్ఛకి పూర్తిగా తలవొగ్గాలి. గురువు మాటని శిరసావహించాలి. ఇదీ శిష్యరికం అంటే అని పేర్కొన్నారు. పాపం! రావ్‌సాహెబ్, ఛగన్‌లకి నోట మాటరాలేదు. ఖిన్నులై నిలబడ్డారు. ఇంతలో కబురు వచ్చింది. బయట గుమ్మం దగ్గర దిన్వార్ ఇరానీ నిలబడి వున్నాడంట. బాబావారి దర్శనం ఇవ్వరని అంటే వినిపించుకోవటంలేదుట. మెహెర్‌బాబాని నేను దర్శించాలి. అర్జెంటు కబురు చెప్పాలి ప్రభువుకి అన్నాడంట. ఈ మాట బాబావారికి చెపితే, అతడిని లోపలికి పంపమన్నారు. దిన్వార్ చూస్తూనే "ఎందుకు వచ్చావ్" అని ప్రశ్నించారు.

**దిన్వార్:** మీకో ఉత్తరం తెచ్చాను బాబా!

**బాబా:** నాకు ఉత్తరమా, ఆశ్చంగా వుందే!

**దిన్వార్:** ఈ ఉత్తరం మీకు వ్రాయలేదు బాబా. బ్రిటీషు దౌత్యవేత్తకు మీ తరఫున వ్రాసిన ఉత్తరం ఇది.

**బాబా**: ఎవరు తెచ్చిచ్చారా వుత్తరాన్ని.

**దిన్వార్:** మీ భక్తుడు, ఈ దాసుడు.

**బాబా:** ఎవరి దగ్గర నుంచి తెచ్చావు సిఫార్సు ఉత్తరం.

**దిన్వార్**: దుజ్‌దాబ్ గవర్నరుగారి నుంచి

**బాబా**: ఎందుకని

**దిన్వార్:** మీరు, మండలి రేపు ఉదయం రైల్లో సరిహద్దు దాటడానికి అనుమతించమని, వీసా ఇవ్వమని గవర్నరు బ్రిటీషు కౌన్సిల్‌కు సిఫార్సు చేశారు.
**బాబా:** ఎలా సంపాదించావు సిఫార్సు.
**దిన్వార్:** మీ కృప వల్ల సార్.
**బాబా:** శహబాష్ భలేపని చేశావ్. ఇలా దగ్గరకిరా.

దిన్వార్ దగ్గరకి రాగానే బాబావారు అతని వెన్ను తట్టారు. ఆశీర్వదించారు. బాబావారు అతని తలపై చేయిపెట్టగానే దిన్వార్ ఒళ్ళు పులకరించింది. మనస్సు ఆనందంతో పొంగిపోయింది. ఈ జన్మకీ వరం చాలు ప్రభూ అనుకొన్నాడు. ప్రొద్దుటివరకూ దర్శనం దొరకదని త్రిప్పి పంపబడిన వ్యక్తికి, ఇప్పుడు ప్రభు దర్శనం దొరికింది. ఆశీస్సు లభించింది. మెప్పుకోలు సొంతమయ్యింది. మండలివారికి ఇదంతా కలా, భ్రమా అనిపించింది. ఛాన్జీ, రావ్‌సాహెబ్ అయితే అవాక్కయ్యారు. తాము ఏది సాధ్యం కాదని అంటూ వచ్చామో, ఆపని అసాధ్యంకాదని దిన్వార్ నిరూపించాడు. బాబావారి మాట నిజమయింది. ఇంకోసారి ప్రయత్నించక బాబావారినే తప్పుపట్టాము అని సిగ్గుపడ్డారు. వంకలేనమ్మ డొంకపట్టుకొన్నట్లు బాబావారు తమ భోగట్టా వెల్లడించవద్దన్నారన్న మాటపట్టుకొని వీసాలు తీసుకురావడం మావల్ల కాదనడం తప్పు అనుకొన్నారు. ప్రేమ పయోని పంచన వుంటూ ప్రేమ మహత్తుని తెలుసుకోలేకపోయానని కుచించుకుపోయారు. బాబావారు కూడా ఇదేమాట అన్నారు. దిన్వార్‌కి పేరు, పలుకుబడి లేవు. డబ్బు అంటే అదీ లేదు. ఓ చిన్న వ్యాపారి ఇతగాడు. అయినాసరే ఏకాయెకి గవర్నర్‌నే కలిశాడు. మన కష్టం చెప్పించి గట్టెక్కించమని అడిగాడు. ఇతగాడి విజ్ఞప్తిపైన గవర్నరు బ్రిటీషు దౌత్యవేత్తకి ఉత్తరం వ్రాసియిచ్చారు. ఓ సగటు మనిషికి ఇది ఎలా సాధ్యమయింది. ఎలా సాధ్యమయింది అంటే దిన్వార్ ప్రేమ వల్లనే. భగవత్ప్రేమ, మహిమ దిన్వార్ ప్రత్యక్షంగా చవిచూశాడు. మీకు చూపించాడు అని బాబావారే పేర్కొన్నారు. దిన్వార్ చేసిన పని చిన్నపని కాదు. అదేమీ చిన్న సేవ కాదు. అతనికి ఎవరూ చెప్పలేదు. మనకి బ్రిటీషు వీసాలు దొరకటం లేదని. మీరెవరూ అతని సాయం కోరలేదు. తనంత తానుగా రంగప్రవేశం చేశాడు. మనకి కూడా చెప్పలేదు. శాయశక్తులా ప్రయత్నించాడు. మన సమస్యని పరిష్కరించాడు. ఇదీ నిస్వార్థ సేవ. స్వచ్ఛందంగా, ఎవరి ప్రేరణ లేకుండా సాయం చేయటమంటే ఇదే. దిన్వార్ ఏమాశించాడు? ఏమీ ఆశించలేదు. నా ఆశీస్సులు దొరికితే చాలనుకొన్నాడు. ఇటువంటి సేవామూర్తిని ఎప్పుడూ విజయం వరిస్తుంది అన్నారు. ఈ విజయం వెనుక మరో రహస్యం వుందన్నారు. మన వీసాల కోసం ప్రయత్నించమని దిన్వార్‌ని ప్రేరేపించింది ఎవరు. అతని ప్రేమ. ఆ ప్రేమ వల్లనే అతన్ని విజయం వరించింది. దిన్వార్‌ది నిస్వార్థ సేవ అన్నారు. తమకెంతో ఆనందంగా

వుందన్నారు. దిన్వార్ తమ ఆశీస్సులకి అర్హుడని అంటూ, రావ్‌సాహెబ్‌కీ, ఛగన్‌కీ రెండు అక్షింతలు వేశారు. వీళ్ళిదర్నీ చూడండి. నా దగ్గర ఎన్నో ఏళ్ళుగా వుంటున్నారు. నా కార్య విధానం వాళ్ళకి తెలుసు. మాట్లాడితే మెహెరుని మండలివారమని సగర్వంగా చెప్పుకుంటారు. నా ప్రియ శిష్యులమని గొప్పగా చెప్తారు. కానీ ఏంచేశారు? వీసా విషయంలో నామాటని పెడచెవినిపెట్టారు. బ్రిటీషు దౌత్యవేత్తకి ఏంచెప్పాలో ఎలా చెప్పాలో పదేపదే చెప్పాను. నేను చెప్పినట్లు చేయాలా? వద్దా? అబ్బే! నేను చెప్పినట్లు చేయలేదు సరికదా, కౌన్సిల్ ఆఫీసుకు వెళ్ళడానికే తటపటాయించారు. బాబా చెప్పినట్లు చేస్తే ఏమవుతుందో అనుకొన్నారు. సొంత తెలివితేటలు ప్రదర్శించాలనుకొన్నారు. బుర్రకి పనిచెప్పారు అని బాబావారు అంటుంటే, పాపం ఛాన్జీగారు, రావ్‌సాహెబ్‌గారు సిగ్గుతో తలదించుకొన్నారు. బాబావారి ప్రతి మాటా ఒక దీవెన. మళ్ళీ మళ్ళీ తప్పుచేయకుండా జాగ్రత్తపడమని ఓ హెచ్చరిక. అవి తిట్లుకావు. ఎద్దేవ అసలు కానేకాదు అని సావధానపడ్డారు. ప్రేమ మహత్తుని కళ్ళకు చూపించవయ్యా దిన్వార్, నీకు శతధా సర్వధా రుణపడి వుంటామనుకొన్నారు. మీ మనస్సు నాకు తెలుసులే అంటున్నట్లు బాబావారు చిరునవ్వునవ్వారు. అయిపోయింది ఏదో అయిపోయింది, దిగులు పడకండి ఇప్పుడు పనిపై దృష్టిపెట్టండి అని హితవు చెప్పారు. దిన్వార్‌తో కలిసి బ్రిటీషు కౌన్సిల్ దగ్గరకి వెళ్ళండి, గవర్నరు గారి ఉత్తరాన్ని ఇవ్వండి వెంటనే అని చెప్పారు. అప్పటికి బాగా ప్రొద్దుపోయింది. చలి వణికిస్తోంది. అయినా సరే రావ్‌సాహెబ్, ఛగన్, దిన్వార్‌లు బ్రిటీష్ దౌత్య కార్యాలయానికి వెళ్ళేసరికి రాత్రి పది అయింది. అక్కడ ఉప దౌత్యవేత్త వున్నాడు. అతనికి గవర్నరుగారి సిఫార్సు లేఖ ఇచ్చారు. ఉదయాన్నే రమ్మన్నాడాయన. రావ్‌సాహెబ్, ఛగన్‌లకి రాత్రి నిద్రపట్టలేదు. మంచంపై అటూ ఇటూ దొర్లుతూనే వున్నారు. నాల్గింటికే లేచి కూర్చున్నారు. ఎప్పుడు తెల్లవారుతుందా అని వాళ్ళెంత తొందరపడ్డా గడియారంలో ముళ్ళు నెమ్మదిగానే కదిలాయి. సూర్యోదయమవుతూనే ఇద్దరూ బ్రిటీషు దౌత్య అధికారి ఇంటికి పరుగెత్తారు. బాబావారి గురించీ, మండలి గురించీ భోగట్టా సమర్పించారు. ఈ వేళ్టి రైలులోనే బాబా ఇండియాకి వెళ్ళాలి. వీసాలు వెంటనే ఇప్పించమని అభ్యర్థించారు. బయట కూర్చోండి పిలుస్తా అన్నాడు అధికారి. ఎనిమిదింటికి పిలుపు వచ్చింది. గవర్నరు గారి సిఫార్సు బాగానే వుందికానీ, నాకేదో అంతా గందరగోళంగా కన్పిస్తోంది. మీరెవరు? మీ బాబా ఎవరు? చెప్పండి అని నిలదీశాడు. అప్పట్లో మన దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం మంచి ఊపులో వుంది. దాస్య శృంఖలాల నుంచి భారతదేశానికి విముక్తి సాధించాలన్నదే కమ్యూనిస్టుల ధ్యేయం. ఉద్యోగం సద్యోగం లేని హిందువులు, మహమ్మదీయులు, ఇరానీలు కూడా కమ్యూనిస్టు పార్టీలో చేరారని బ్రిటీషు ప్రభుత్వానికి భోగట్టా వచ్చింది. అందుకనే దుజ్‌దాబ్ బ్రిటీషు దౌత్యవేత్తకి ప్రభుత్వం చెప్పింది

ఏమని? వీసాలు జాగ్రత్తగా ఆచితూచి ఇమ్మని. ఇలా పైనుంచి ఉత్తర్వులు రావటం, మన ఛాన్జీ గారు, రావ్‌సాహెబ్‌లు వీసాల కోసం దరఖాస్తు పెట్టడం ఇంచుమించు ఒకేసారి జరిగాయి. దీనితో ఆ అధికారికి భయం పట్టుకొంది. ఈ మెహెర్‌బాబా అనుచరులు కమ్యూనిస్టు ఉద్యమకారులేమో? వీళ్ళకి వీసా ఇస్తే, ఇండియాలో ఏ అరాచకం సృష్టిస్తారో వీళ్ళు? అలాగ జరిగితే, ముందు వీసా ఇచ్చాను కాబట్టి నా పీకకి చుట్టుకుంటుంది. ఈ గొడవ ఇదీ అతగాడి క్షోభ. గమ్మత్తు ఏమంటే, మెహెర్‌బాబాని ఇండియాలోకి రానీవద్దని బ్రిటీషు ప్రభుత్వం దౌత్యవేత్తలని ఆదేశించింది. ఈ తాఖీదు పరిష్యా రేవు పట్టణాల్లో వున్న బ్రిటీషు కాన్సలేట్‌లకి వెళ్ళింది. దుజ్‌దాబ్ సముద్రానికి దూరంగా కొండల్లో, ఎడారిలో వుండటంతో ఈ దొరగారికి ఆ కబురు తెలీదు. ఒకవేళ తెలిసి వుంటే ఏం చేసేవాడో మరి. బాబావారు పరిష్యా యాత్రకి బయలుదేరుతూ బ్రిటీషు పాస్‌పోర్టు తీసుకోలేదు. సంతకం పెడితే కాని పాస్‌పోర్టు ఇవ్వమన్నారు. బాబావారు సంతకం పెట్టను, కనీసం వేలిముద్ర కూడా వేయనని స్పష్టం చేశారు. అయితే బాబా తల్లిదండ్రులు ఇరానీలు కాబట్టి మెహెర్‌బాబా కూడా మావాడే అంటూ బొంబాయిలోని ఇరానీ దౌత్యవేత్త బాబావారిని ఇరాన్ పాస్‌పోర్టు ఇచ్చాడు. ఈ వైనం అలనాటి బ్రిటీషు ప్రభుత్వానికి తెలుసు. అందుకనే బ్రిటీషు ప్రభుత్వం మెహెరుడుని వాపసు రాకుండా అడ్డుకోవాలనుకొంది. ఇరాన్ సాగర తీరంలోని బ్రిటీషు దౌత్యవేత్తల కార్యాలయాలకి తాఖీదు పంపింది. ఒకవేళ మెహెర్‌బాబా సాగరమార్గాన ఇండియా రావాలనుకోవచ్చు. వీసా ఇవ్వకండి అని ఆదేశించింది. ఈ వైనం మన మండలివారికి తెలియదు. కానీ సర్వాంతర్యామికి తెలియకపోతే కదా! సుఖంగా జరిగే సాగరయానం వద్దని, ఎడారి దారిన రైలు ఎక్కాలని నిర్ణయించారు. అలనాటి కురు సభ కృష్ణుడిని పరాభవించబోయి భంగపడినట్లు, ఇలనాటి దుజ్దాబ్ దౌత్య అధికారికి, తెలివితేటలు తమసొత్తు అనుకొని పరబ్రహ్మనే కొట్టబోయాడు. అయితే అదృష్టమనండి, బాబావారి కృప అనండి, కష్టాల కడలిలో పడలేదు. మీ గురించి చెప్పండి అని అతగాడు అడగగానే ఛాన్జీ తడుముకోకుండా చెప్పాడు. మేర్వాన్ ఇరానీ మా గురువు. మేము మేర్వాన్ శిష్యులం అన్నాడు. అతను వెంటనే వీసాలు తయారు చేయమని తన సిబ్బందిని ఆదేశించాడు. గుమాస్తా వీసా కాగితాలు పట్టుకురాగానే సంతకం పెట్టి ఛాన్జీకి ఇచ్చాడు. మీ ప్రయాణం సుఖాంతం అవుగాక అన్నాడు. ఈ కథ నిజంగా సుఖాంతం అయింది అనాలి. ఎందుకంటే, బాబావారు ఇండియాకి తిరిగివచ్చాక చానాళ్ళకి ఓ రోజున ఛాన్జీ బొంబాయిలోని బ్రిటీషు దౌత్యవేత్త ఆఫీసుకు వెళ్ళాడు. మండలి వ్యక్తి ఒకరు విదేశం వెడుతున్నాడు. అతనికి పాస్‌పోర్టు కావాల్సి వచ్చింది. పాస్‌పోర్టు, వీసాలు విషయంలో రాటుతేలాడని ఈపని ఛాన్జీకి అప్పగించారు. ఛాన్జీని చూస్తూనే అక్కడి అధికారి గుర్తుపట్టాడు.

**– సశేషం**

# డేలియా డి లియోన్



డేలియా డి లియోన్, 1930వ దశకంలో మెహెర్‌బాబాను తొలిసారిగా దర్శించుకున్న తొలితరం పాశ్చాత్య బాబా ప్రేమికురాలు. స్పానిష్ దేశీయురాలు.
గొప్ప నటీమణిగా ప్రఖ్యాతి. మెహెర్‌బాబా మండలితో కల్సి విస్తృతంగా పర్యటించిందామె. పాశ్చాత్య బాబా ప్రేమికులు జీన్ అడ్రిల్, కిట్టీ దేవి తదితరులతో కలిసి నాసిక్ ఆశ్రమంలో, మెహెరాబాద్‌లలో చాలాకాలం ఉన్నారామె. బాబావారి ఆదేశాలను తు.చ. తప్పక పాటించిన ధన్యురాలు డేలియా డి లియోన్. మెహెరుడి సన్నిధానంలో తన అనుభవాలను క్రోడీకరించి **ఓషన్ ఆఫ్ లవ్** పేరిట ఆంగ్లంలో గ్రంధస్తం చేసింది. ఈనాడు మనం చూస్తున్న అవతారుడి అనేక చిత్రాల రూపకల్పనలో డేలియా ప్రధాన పాత్ర వుంది. తొలితరం ప్రేమికులలో ముఖ్యురాలు డేలియా. ఆమె తన గురించి పలు సందర్భాలలో చెప్పిన విషయాలను సంక్షిప్తంగా, సమగ్రంగా మెహెర్‌బాబా పాఠకులకు ప్రత్యేకంగా అందించే ప్రయత్నం చేస్తున్నాం. ఇకపై ఆమె మాటల్లోనే దయచేసి పరిశీలించండి.

!!!! !!!!

అది 1930వ దశకం. మెహెర్‌బాబా తన మండలితో కలిసి లండన్ పర్యటనలో వున్నారు. ఆ రోజుల్లో నాటక ప్రదర్శనలు ఎక్కువగా వుండేవి.
స్థానిక బాబా ప్రేమికురాలు మార్గెట్ క్రాస్కేని మ్యూజికల్ కామెడి నాటకానికి దేనికైనా టిక్కెట్లు తీసుకురమ్మన్నారు బాబా. మార్గెట్ తన స్నేహితురాలైన డాలియాను కూడా ఆ నాటకానికి ఆహ్వానించింది. అలా వెళ్ళిన డాలియాని, బాబా మండలి వెళ్ళి కూర్చునేదాకా ఒక ప్రక్కగా నిల్చోమన్నారు. ఆ తర్వాత బాబా ప్రక్కనే ఖాళీగా వున్న సీటులో నేను కూర్చున్నాను. నేను ఆ నాటక ప్రదర్శన చూడలేదు. బాబానే చూస్తూ కూర్చున్నాను. ఆ నాటకం అయిపోయాక, ఆ మర్నాడు బాబా నిన్ను కలవాలని ఉందన్నాను. బాబా సరే అన్నారు. బాబా లండన్‌లో వారం రోజులున్నారు. ఆ వారం



రోజులూ బాబా కిట్టీ దేవీ ఇంట్లో వున్నారు. నేను ప్రతిరోజూ కిట్టీ దేవి ఇంట్లో బాబాని కలుసుకున్నాను. ఆ రోజుల్లోనే ఒక సందర్భంలో బాబా నాతో అన్నారు కదా You are very lucky to have met Me now and He added, it is not luck that brings you here. ఆ తర్వాత నేను బాబాతో మాట్లాడుతూ ఏమీ అడగలేదు. అంతక్రితమే నేను బాబాను కలలో చూశాను. ఆశ్చర్యం! బాబావారి కళ్ళు ఎంతో ప్రకాశవంతంగా వున్నాయి. బాబాను చూసిన క్షణం నుండి నన్ను నేను మరచిపోయాను. ఆయనపై అపారమైన నమ్మకం కల్గింది. జీసస్‌ను ప్రేమించినట్లు ఆయనపట్ల విధేయురాలిగా వుండిపోవాలనిపించింది. నేనిక ఏ గురువు దగ్గరకు వెళ్ళాల్సిన పన్లేదని ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాను. నా మదిలో ఆయన్ని గురువుగా స్వీకరించాను. చిన్నతనం నుండీ నాకు రెండు కోరికలుండేవి. 1) గొప్ప నటీమణి కావాలని వుండేది. 2) భగవంతుడు ఎక్కడ వున్నాడు? ఎలా వున్నాడో తెలుసుకోవాలనే తీవ్ర ఆకాంక్ష వుండేది. డేలియా విషయంలో ఆ రెండు కోరికలూ తీరాయని ఆమె సమకాలీనులు అంటారు. ఆమె రెండవ కోరిక కూడా... ఆ నటస్థానంలోనే లభించిందని వారంటారు. 1933లో తొలిసారిగా మా చెల్లెలు **మింటాతో** కల్సి బాబావారి ఆదేశాలతో నేను తొలిసారిగా భారతదేశానికి వచ్చాను. ఇక్కడున్న బాబావారి ఆశ్రమంలో కొన్నాళ్ళు వున్నాను. ఆ తర్వాత బాబా భారతదేశం నుండి యూరోపు పర్యటనకై బయల్దేరారు. ఆ సమయంలో నేను కూడా బాబా బృందంతో వున్నాను. మెహెర్‌బాబా నన్ను, కిట్టీదేవి, మార్కట్ క్రిస్కీలను క్లుప్తంగా KIMCO అని పిలిచేవారు.
నన్ను మరింత క్లుప్తంగా **లైలా** అని కూడా బాబా సంభోదించేవారు.
1931 డిశంబరులో బాబా అమెరికా పర్యటన ముగించుకుని ఇంగ్లాండుకు వచ్చారు. అప్పుడు బాబా మమ్మల్ని పారిస్‌లో కలుసుకోమని ఆహ్వానించారు.
ఆ సమయంలో మేమందరం బాబాతో కల్సి వీరు ఈఫిల్ టవర్ తదితర పర్యాటక ప్రదేశాలు సందర్శించాం. బాబా బృందంతో కల్సి అనేక ఆటలు ఆడుకున్నాం. బాబా ఇండియాకు తిరిగి వెళుతూ, ప్రతివారం ఉత్తరం రాయాలని నన్ను ఆదేశించారు. అలాగే బాబా కూడా నా ఉత్తరాలకు జవాబు రాశారు.
1936-37 మధ్య కాలంలో నేను బాబా ఆదేశాల మేరకు నాసిక్ ఆశ్రమంలో వున్నాను. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నేను లండన్‌లోనే బాబా ఆదేశాల మేరకు స్థానికంగా గల ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆసుపత్రిలో యుద్ధంలో క్షతగాత్రులకు సేవలందిస్తూ కాలం గడిపాను. ఆ సమయంలో మెహెర్‌బాబా నాకు ఎన్నో లేఖలు రాశారు. బాబా సందేశాలతో కూడిన ఆ ఉత్తరాలు ఇంటర్‌నెట్‌లో పదిలంగా

బధ్రపరిచారు. 1938 నవంబరు 5, 1939 మార్చి 5, 1940 ఫిబ్రవరి 10 తేదీలలో బాబా స్వయంగా మెహెరాబాద్ నుండి డేలియాకు రాసిన లేఖలు ఇంటర్‌నెట్‌లో చూడొచ్చు. తిరిగి 1946 జూన్‌లో జీన్ అడ్రిల్‌తో కల్సి ఇంగ్లాండు నుండి భారతదేశానికి బాబా ఆదేశాల మేరకు వచ్చాను. చాలా రోజులు నాసిక్ ఆశ్రమంలో వున్నాను. ఆ సమయంలో బాబా తన ప్రేమికుల్ని వారికి చేతనైన కొన్ని పద్ధతులు, జూన్ 26 నుండి జూలై 20 దాకా పాటించమన్నారు. అందులో మాకు అనుకూలమైనది, బాగా నచ్చిన అంశం ఒంటిపూట ఉపవాసం ఉండటం.
అది సులువైందని నేను, జీన్ అడ్రిల్ భావించాం. ఒంటి పూట ఉపవాసం వుంటూ మధ్యలో ఒకసారి కాఫీ/టీ త్రాగొచ్చన్నారు. నేను – జీన్ – ఈ పగలు భోజనం – రాత్రి ఉపవాసం వుండే నియమాన్ని ఎంచుకుని, ఆ పద్ధతిని క్రమశిక్షణతో పాటించాం. మరో నియమంలో బాబా నామాన్ని రోజుకి లక్షసార్లు వారం రోజులపాటు జపించాలి. ఓ నల్గురు మహిళలు ఈ పద్ధతి చేపట్టారు. ఇదైతే మావల్ల అసాధ్యం అనుకున్నాను. ఐతే వారికి లక్షసార్లు నామజపానికి మొదటి రోజున 15 గంటలు పట్టింది. బాబా నామాన్ని బిగ్గరగా జపించాలి. ఆ తర్వాత లక్ష నామ జపం కేవలం 10 గంటల్లోపే పూర్తిచేశారు. ఇలా ఒకవారం పూర్తయ్యాక మరుసటి వారం రోజులు మౌనంగా నామం జపించాలని బాబా ఆదేశించారు. మూడవ వారంలో రోజుకొక పేదవానికి భోజనం పెట్టమన్నారు. నాల్గవవారం సంపూర్ణంగా ఉపవాసం వుండమన్నారు. ఇదిఇలా వుంటే ఆ నల్గురు మహిళల్లో ఒకరు 'దీనా' చివరిరోజున స్పృహ తప్పి పడిపోయింది. అమె చనిపోయిందని, శ్వాస ఆగిందని భావించాం. బాబాకు ఫిర్యాదు చేశాం. ఇంతలో దీనా లేచి కూర్చుని ఏం జరుగుతోందని ఏమీ ఎరుగనట్లు అడిగింది. ఆ స్పృహ తప్పిన సమయంలో తాను అనంతమైన ప్రశాంతత, శాంతి చవిచూశానని చెప్పింది. నాసిక్ ఆశ్రమంలో నాకు తెలిసిన కిట్టీదేవీ తదితరులు చాలామంది వున్నారు. 1933, 1936లలో నేను ఇక్కడి ఆశ్రమానికి వచ్చాను కాబట్టి, ఇక్కడ నాకు చాలామంది పరిచయస్తులు వున్నారు. ఆనాటి తన యాత్ర విశేషాలను మన కళ్ళెదుట వుండేలా తన స్వీయరచనలో పొందుపరిచింది. ఆ రచనను ఇంటర్‌నెట్‌లో చూడొచ్చు. ఆనాటి మధురక్షణాలను తేదీల వారీగా వర్ణించింది.
బాబా తన ప్రవచనాలలో ఒకసారి ఇలా అన్నారు. ఈతరం తూర్పు దేశంలో జన్మించినవారు, వారి మరుసటి జన్మ పశ్చిమాన వుంటుందన్నారు. అలాగే అక్కడివారు భారతదేశంలో జన్మిస్తారన్నారు. మరోమాట కూడా బాబా అన్నారు.
తూర్పు దేశీయులు పురుషులు ఆధ్యాత్మికంగా ఉన్నతిలో వుంటారన్నారు.
అదే పశ్చిమాన స్త్రీలు ఆధ్యాత్మికోన్నతి సాధిస్తారని బాబా ప్రకటించారు.
ఇది ఈ అవతారకాల విశిష్టత. డెలియా డిలియాన్ యూరోప్‌లోని పనామాలో




1901 ఫిబ్రవరి 10న జన్మించింది. లండన్‌లో స్థిరపడింది. 1993 జనవరి 21న తుదిశ్వాస వదిలింది. బాబా మౌనంగా వున్నారని నేనెన్నడూ భావించలేదు. మన హృదయాలతో బాబా నేరుగా మాట్లాడతారు. నాకు తొలిసారిగా ఇచ్చిన సందేశంలో ఇలా అన్నారు. Baba sends you His love. He is always with you, in you, near you. Be happy. Don't worry. బాబా ఆశ్రమంలో వుండేరోజుల్లో మాకు ఒక్కొక్కరికి ఒక్కో డ్యూటీ వుండేది. నా పని ఏమంటే బాబా అడిగినప్పుడు ఆయనకు ఇష్టమైన కథలు, నవలలు బిగ్గరగా చదివి వినిపించడం. ఒక్కోసారి బాబా ఆరుబయట వేగంగా నడుస్తుండేవారు. ఆ సమయంలో ఆయన పరుగులాంటి నడకతో వుంటే అంతే వేగంగా ఆయన వెనక్కాల నేను చదువుతూ వెళ్ళేదాన్ని. అందరికీ ఆశ్చర్యం వేసేది. బాబాకు జోక్స్ అంటే చాలా ఇష్టం. కొన్ని పుస్తకాల్లోంచి జోక్స్ సేకరించి రాసుకుని బాబా కోసం చదివి వినిపించే వాళ్ళం.

అవతారునిలో అనంతమైన ప్రేమ, కరుణ, దయ, మేం గమనించాం.
బాబా సందేశాలు వల్లెవేయడం కాదు. ఆచరణలోఅమలుకు ప్రయత్నించాలి.
మన ఈ ప్రయత్నానికి బాబా తప్పక విజయం సమకూరుస్తాడు.
ఇందుకు ధైర్యం, క్రమశిక్షణ, అకుంఠిత దీక్ష అత్యవసరం.
భగవంతుడు ప్రతి ఒక్కరిలో వున్నాడు. ప్రతి దానిలోనూ వున్నాడు. ఈ ప్రాథమిక విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేసేందుకు ఎన్నిమార్లో, ఎన్ని రకాలుగానో, బాబా తన సందేశాలలో చెప్పారు. బాబా సందేశాలలో అన్నింటిల్లో ఈ ఒక్క విషయాన్నే మన మస్తిష్కానికి ఎక్కేలా చెప్పారు. ప్రాథమిక మానవ సంబంధాలు మరచిపోతున్నాం. ద్వేషం, పగ, వంటి నీచ ప్రవృత్తికి తరచు మనం లోనవుతున్నాం. అవి, మనల్ని మనమే అవమానించుకునేలా చేస్తున్నాయని మనం అర్థం చేసుకోవాలి.
బాబా సమక్షంలో స్వచ్ఛమైన ప్రేమ ప్రవహిస్తుంది. ఆయన సమక్షంలో వున్న సమయంలో నీవెవరు, నీవేం చేస్తున్నావో ఆలోచింపజేస్తుంది. బాబా మనల్ని ప్రేమించినట్లు బాబాను మనం నిత్య సహచరునిగా ప్రేమించడం అలవరచుకోవాలి. బాబా ప్రేమలో మనలోని అహంకారం తొలిగిపోవాలి! ఇదే నేను బాబా సమక్షంలో తెలుసుకున్న వాస్తవాలు.
అవతారుని సన్నిధిలో గడిపిన క్షణాలు గుర్తుచేసుకుంటూ **ది ఓషన్ ఆఫ్ లవ్** పేరిట డేలియా గ్రంథస్తం చేశారు. వీలుచిక్కితే ఒకసారి పరిశీలించండి!!
ఆమె గురించిన ఆసక్తికర సమాచారం మరింత ఇంటర్‌నెట్‌లో లభిస్తుంది.
బాబా సమక్షంలో జీవితం గడిపిన డేలియా డి లియోన్ ఈ తరం వారందరికీ ప్రాతస్మరణీయురాలు.

# జమా ఖర్చులు

**2014-జనవరి నుండి 2014 డిశంబరు వరకూ**

| జమలు | | | ఖర్చులు | |
|---|---|---|---|---|
| 1. | వార్షిక సభ్యత్వం | 23,445.00 | ప్రింటింగ్ చార్జి | 79,875.00 |
| 2. | డొనేషన్లు | 5,500.00 | డి.టి.పి చార్జి | 4,500.00 |
| | | ---------------- | పోస్టల్ స్టాంపులు | 2,920.00 |
| | | 28,945.00 | మెహెరాబాద్ స్టాలు | 800.00 |
| 3. | లోటు | 66,650.00 | కవర్లు, స్క్రీన్ ప్రింట్ | 7,500.00 |
| | | ------------- | మొత్తం ఖర్చు | **95,595.00** |
| | | 95,595.00 | | |
| | **లోటు** | **66,650.00** | | |

**జమలు:**

వార్షిక సభ్యత్వం రూపేణా కొందరు రు. 100/- మరికొందరు రు.200/- చొప్పున పంపినారు. 2015 జనవరి నుండి డిశంబరు 2015 దాకా మొత్తం వార్షిక సభ్యత్వం పంపినవారు 232 మంది. ముట్టిన నగదు రు.23,445/-. కాగా, మాస పత్రికకు డొనేషన్లు రూపంలో రు.5,500/-పంపినారు.

జమలు మొత్తం రూ.28,945/-అందినాయి.

లోటు బడ్జెట్- రూ.**66,650**/-

**ఖర్చు:**

2015 జనవరిలో 1250 కాపీలు చొప్పున ప్రచురించడమైంది.

2015 ఫిబ్రవరి 1300 కాపీలు, మార్చి నుండి డిశంబరు దాకా 1350 కాపీలు చొప్పున ప్రచురించడమైంది. ప్రతి 1000 సంచికలకు రూ 4800/- రూపాయలు చొప్పున ప్రతి అదనపు 100 ప్రతులకు రు.480/- చెల్లించడమైంది. ఆ మాదిరిగా 2015 జనవరి నెల 1250 కాపీలకు గాను 6000 రూపాయలు, 2015 ఫిబ్రవరి నెలలో 1300 కాపీలకు గాను 6,240 రూపాయలు చెల్లించడమైంది. కాగా, 2015 మార్చి నుండి డిశంబరు దాకా 1350 కాపీలకు గాను, రు. 6480/- చొప్పున చెల్లించడమైంది. ఐతే, జూలై 2015 సంచిక ఇందుకు మినహాయింపుగా,

రూ. 9,315/- చెల్లించడమైంది. జూలై 2015 సంచికను, మొత్తం 1350 కాపీలు, మౌన వార్షికోత్సవ సంచికగా మల్టీకలర్ కవర్‌పేజీతో ప్రచురించడమైంది.

ప్రింటింగ్ చార్జీలకై మొత్తం రు.79,8750/- చెల్లించడమైంది.

హైదరాబాద్‌లోని శ్రీ సాయి శ్రీనివాస ప్రింటర్స్, ఖైరతాబాద్ ఫోన్:040-23392566

వారు పత్రిక ప్రారంభపు సంచిక నుండి నేటి వరకూ ప్రతినెలా ప్రింట్‌చేసి అందజేస్తున్నారు. కాగా, పోస్టలు ఖర్చులు ఇతరత్రా పైన పేర్కొన్నట్లు మొత్తం **ఖర్చు** రూ. **95,595**/-, జమలు రూ.28,945/- కాగా, ఈ ఏడాది రూ.**66,650**/-లోటుగా నమోదయింది. **జీవిత సభ్యులు** 2015 ఏడాది మొత్తం జీవిత సభ్యత్వం రు. 1000/- చొప్పున 31 మంది, రూ. 31,000/-, ఒక్కరు రూ.900/-, 13 మంది రూ.500/- చొప్పున రూ. 6,500/- జీవిత సభ్యత్వం చెల్లించారు.

కాగా, జీవిత సభ్యత్వం ఖాతాకు మొత్తం రూ. 38,400/- జమ అయ్యింది.

జీవిత సభ్యులు చెల్లించిన మొత్తాన్ని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, **(ఐ.ఓ.బి)** సైనిక్‌పురి బ్రాంచ్, సికింద్రాబాద్‌లో ఫ్లెక్సీ-ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం అకౌంట్ నెం. **SB-SLVRI ACCOUNT NUMBER : 29152** జమచేస్తున్నాం. జీవిత సభ్యత్వం నగదును బ్యాంకు ఖాతాలో వేసి, దానిపై వచ్చే వడ్డీని పత్రికా నిర్వహణా ఖర్చులలో వినియోగించాలని ముందుగా నిర్ణయించినప్పటికీ, పత్రిక ప్రారంభం నుండి నేటి వరకూ బ్యాంకులో వున్న నిల్వలపై వచ్చే వడ్డీని పత్రిక నిర్వహణలో ఉపయోగించలేదని మనవి.

కేవలం వార్షిక సభ్యత్వం, అడపాదడపా వచ్చే విరాళాలతో పత్రిక పత్రిక ఖర్చులకు వినియోగిస్తున్నాము. అలాగే, ప్రతి ఏడాది వస్తున్న లోటు బడ్జెట్టును శ్రీ దశిక ప్రసాదరావు గారి కుమారుడు శ్రీ మెహెర్‌బాబా దశిక, అమెరికా అందజేస్తున్నారని తెలియజేసుకుంటున్నాము. జీవిత సభ్యత్వం చెల్లించిన వారి వివరాలన్నీ ఎప్పటికప్పుడు ప్రతి నెలా మెహెర్‌బాబా సంచికలో ప్రచురిస్తున్నాం. పోస్టాఫీస్ ఖాతాలలో, బ్యాంకులలో జమ చేసిన జీవిత సభ్యుల నగదు ఆపై వచ్చిన వడ్డీ వివరాలను పేజి నంబరు 35లో ప్రచురించడమైనది. దయచేసి పరిశీలించండి.

మెహెర్‌బాబా పత్రిక నిర్వహణకు సుమారు రూ. 20 లక్షలు డిపాజిట్లు అవసరమౌతాయి. ఆ లక్ష్యం చేరేవరకూ జీవిత సభ్యుల చెల్లింపులపై వచ్చే వడ్డీని అసలుకే జమ చేయ్యాలని నిర్ణయించడమైంది. ఐతే, కొందరు బాబా ప్రేమికులు ఈ జీవితసభ్యత్వాన్ని రూ.2000గా పెంచవల్సిందిగా సూచిస్తున్నారు.కానీ, అధికశాతం బాబా ప్రేమికులకు భారం అవుతుందన్నది మా అభిప్రాయం. మెహెర్‌బాబా పత్రికలన్నింటినీ ప్రతి రెండు సంవత్సరాలకొకసారి, సుమారు 24 సంచికలను ఒక వాల్యూంగా బైండ్ చేయిస్తున్నాం. మెహెర్‌బాబా సంచికలన్నీ కలిపి 7 వాల్యూంలు అయినాయి. మెహెర్‌బాబా పత్రికకు పదివేల రూపాయలు ఆపై డొనేషన్ ఇవ్వగల్గిన వారికి ఒక వాల్యూంను బహుమతిగా అందజేయాలని ప్రతిపాదించాం!! పత్రిక పదివేల సైన్యంతో సమానం. పత్రిక పురోభివృధికి మీ వంతుగా ఒక్కొక్కరూ మరొకరిని సభ్యునిగా చేర్పించండి. మెహెర్‌నామ వ్యాప్తికి సహకరించవల్సిందిగా కోరుతున్నాం.

## పోస్టాఫీస్, బ్యాంకు ఖాతాలలో జమ అయిన జీవిత సభ్యత్వం నగదు– వడ్డీలతో కల్పి వివరాలు 10.1.2016 వరకూ.,

| Sl. No | Life Membership deposits | Sl. No | Life Membership deposits |
|---|---|---|---|
| 01 | **MIS- BOLARUM**<br>Jt. A/C No: 8021331;<br>Rs. **6,48,000/-**<br>29-02-2012 TO 29.2.2017<br>Interest P.M.<br>RS. **4,470/-** | 1A | RD- BOLARUM RS. 4,470/-<br>Jt. A/C No: 17702<br>03-04-2012 To 03-04-2017<br>**Accrued int. as on Dec.'15: Rs. 2,01,150/-** |
| 02 | MIS- BOLARUM<br>Jt. A/C No: 8062844;<br>**Rs. 3,66,000/-**<br>04-12-2009 To 04-12-2015<br>Interest P.M. Rs. 2440/- | 2B | RD- BOLARUM<br>Jt.A/C No: 16904<br>18-01-2010 To 18-01-2015<br>**Accrued int. as on Dec.'14:Rs. 1,75,680/- matured. to be drawn** |
| | **DONATIONS** | | **DONATIONS** |
| 03 | **Ms. SARADA** has donated a total of Rs.60,000/- for Life Membership A/C. Deposited in MIS-Post Off. Tirumalghery<br>Jt. A/C No: 8020248<br>17.3.2011 To 17.3.2017<br>Interest P.M. 400/- | 3C | RD- - Tirumalghery<br>Jt. A/C No: 70139<br>**25-4-2011To 25-4-2017**<br>Rs. 400/- PM<br>**Accrued int. as on Dec.'15: Rs. 22,400/-** |
| 04 | **Ms. SARADA** has donated Rs.30, 000/-. For Life Membership account. It was deposited in KARUR VYSYA BANK, A/C No. 1410.501.93705/1 Sec'bad Br. The details are: 5.9.2012 To 5.9.2015 renewed up to 5.9.2016 Maturity Value **Rs. 42,941/-** | 05 | **Indian Overseas Bank Flexi Fixed deposit account number - 29152 balance particulars as on 10.1.2016, Rs. 2,15,918.66** |
| | **Total deposits accrued under life Membership from S.No. 1 to 5 Rs. 17,32,089.66** | | పైన పేర్కొన్న క్రమ సంఖ్య 2 లోని నగదు మెచ్యూరయినది. ఆ నగదును తిరిగి డిపాజిట్ చేయవల్సిన అవసరం వుంది. ఆ వివరాలు వచ్చే నెల సంచికలో ఇవ్వగలం. –ఎడిటర్ |

# రెండు మాటలు

మెహెర్‌బాబా పత్రిక నిర్వహణకు బ్యాంకులో డిపాజిట్‌లు రమారమిన రూ. 20 లక్షలు ఆపైన జమకాగల్గితే, ఆ మొత్తంపై వచ్చే వడ్డీతో పత్రిక నిర్వహణ సులభమౌతుంది. అంటే పత్రిక ప్రచురణకయ్యే ఖర్చుకు ఎలాంటి ఇబ్బంది వుండదు. ఆ ఉద్దేశ్యంతోనే జీవిత సభ్యులు చెల్లింపులపై వచ్చే వడ్డీని అసలుకే జమ చేస్తున్నాం. ఇది పాఠకులకు బాగా తెలుసు. ఐతే, కొందరు బాబా ప్రేమికులు ఈ జీవితసభ్యత్వాన్ని రూ. 2000గా పెంచవల్సిందిగా సూచిస్తున్నారు. కానీ, అధికశాతం బాబా ప్రేమికులకు భారం కాకూడదన్నది మా అభిప్రాయం.

## పదివేల రూపాయలు ఆపై డొనేషన్

ఈ విషయంలో మరో సూచనను అనుసరించి, మెహెర్‌బాబా పత్రికలన్నింటినీ ప్రతి రెండు సంవత్సరాలకొకసారి, సుమారు 24 సంచికలను ఒక వాల్యూంగా బైండ్ చేయిస్తున్నాం. ఈ మేరకు పత్రిక ప్రారంభ సంవత్సరం నుండి 2014 జూన్ దాకా మెహెర్‌బాబా సంచికలన్నీ కలిపి 7 వాల్యూంలయినాయి. మెహెర్‌బాబా పత్రికకు పదివేల రూపాయలు ఆపై డొనేషన్ ఇవ్వగల్గిన వారికి ఒక వాల్యూంను బహుమతిగా అందజేయాలని ప్రతిపాదించాం!! ఇది ఉభయకుశలోపరి!! ప్రక్క పేజీల్లో పత్రిక ఆదాయ వ్యయ వివరాలు, బ్యాంకు, పోస్టాఫీసు అకౌంట్లలలో జమలు మీరు గమనించేవుంటారు. పత్రిక ప్రచురణ కోసం చేస్తున్న ఖర్చు వివరాలు గమనించవల్సింది. జీవిత సభ్యులు చెల్లించిన మొత్తం వారు ఏ రోజున పత్రిక వద్దనుకుంటే ఆ రోజున, వడ్డీ లేకుండా, అసలు మొత్తం తిరిగి చెల్లించాలని ప్రతిపాదించాం. ఇది మెహెర్‌బాబా సందేశాల వ్యాప్తికి అంకితమైన మాస పత్రిక. బాబా ప్రేమికులు తమ బంధుమిత్రులనందరినీ జీవితసభ్యులుగా చేర్పించండి. ఇప్పటికే పలు జిల్లాలలోని పలువురు బాబా ప్రేమికులు ఈ కార్యక్రమాన్ని తమ బాధ్యతగా చేపట్టారు. వారందరికి పేరుపేరునా మా ప్రత్యేక జైబాబాలు. కృతజ్ఞతలు. పత్రిక పదివేల సైన్యంతో సమానం. పత్రిక పురోభివృధికి మీ వంతుగా ఒక్కొక్కరూ మరొకరిని కనీసం వార్షిక సభ్యునిగా చేర్పించండి. మెహెర్‌నామ వ్యాప్తికి ఇంతకన్నా సులువైన మార్గం ఉందా? మీరే చెప్పండి. మీ అభిప్రాయాలు మాకు శిరోధార్యం. **మీ పోస్టలు చిరునామా స్పష్టంగా ఇవ్వండి. మీ నివాసానికి దగ్గర్లోని కొండగుర్తులు తెలపండి. పిన్‌కోడ్‌తోపాటు, మీ మొబైల్, ఇ-మెయిల్ అడ్రస్సు కూడా ఇయ్యవల్సిందిగా మనవి.**

# 2015-సింహావలోకనం

జనవరి 2016 మెహెర్‌బాబా సంచిక మీ చేతిలో వుంది.
మెహెర్‌బాబా సంచికను బాబావారి సందేశాలతో ఆసక్తికరంగా మీరందరూ చదివేలా అందజేయాలని మా శక్తిమేర కృషి చేస్తున్నాం.మెహెర్‌బాబా సందేశాల వ్యాప్తికి సంపూర్ణంగా అంకితమైన మాసపత్రిక మెహెర్‌బాబా. కాగా, 2015 జనవరి నుండి డిసెంబరు దాకా మెహెర్‌బాబా సంచికలలో ప్రచురించిన పలు ప్రధాన విషయాలను 2015లో జరిగిన పలు విశేషాలను సంక్షిప్తంగా ఒకసారి సింహావలోకనం చేసుకుందాం!! వర్తమానం భవిష్యత్తుకు మార్గదర్శకం కదా!
ప్రధానంగా 2015 ఏప్రిల్‌లో బాబా ప్రేమికులు జరిపిన కాశ్మీరు యాత్ర, అలాగే నవంబరులో మెహెరాబాద్‌లో నిర్వహించిన ఈస్ట్రన్ గేదరింగ్ 50వ వార్షికోత్సవ సహవాస్ ప్రధానంగా చెప్పుకోవాలి. ఇవికాకుండా అనేక బాబా సెంటర్ల వార్షికోత్సవాలు ప్రత్యేక బాబా సహవాస్ కార్యక్రమాలు అనేకం జరిగాయి. వాటన్నింటి గురించి బాబా ప్రేమిక పాఠకలోకానికి ఆయా సహవాస్ వివరాలను మాసపత్రిక ద్వారా ఎప్పటికప్పుడు యథాతథంగా అందజేసే ప్రయత్నం చేశాం.
2015 జనవరి నుండి అనేక ప్రత్యేక శీర్షికలతో అవతారుని సందేశాలు ప్రచురించడమైంది. ముఖ్యంగా 2014 మార్చి నెలలో **"గుజరాతీ సహవాస్"** శీర్షికతో ధారావాహిక సీరియల్ ప్రారంభించాం. అనంతరం, ఆగస్టు నుండి ' **తెలుగు సహవాస్**' శీర్షికతో 1955 నవంబరు నెలలో అవతారుని సమక్షంలో ఆనాటి బాబా ప్రేమికులు గడిపిన సహవాస్ విశేషాలను, మెహెర్‌బాబా చెప్పిన అనేక ఆసక్తికర, ఆధ్యాత్మిక విషయాలను ప్రచురిస్తున్నాం. గుజరాతీ, తెలుగు, హిందీ, మరాఠీ ప్రేమికులకు మెహెర్‌బాబా ప్రత్యేక ప్రాంతీయ సహవాస్ కార్యక్రమాన్ని సుమారు 30 రోజులపాటు నిర్వహించారు. ఎన్నో అద్భుత విషయాలు ఆ సహవాస్‌లో బాబా ముచ్చటించారు. అదొక అరుదైన సహవాస్. అరుదైన సమాచారం. ఆనాటి విశేషాలు నేటి తరానికి అందించడానికి చిన్ని ప్రయత్నంగా ఈ ధారావాహిక సీరియల్ చేపట్టాం. కాగా, ఏప్రిల్ 2015 సంచిక నాటికి తెలుగు సహవాస్ వివరాలు పూర్తయ్యాయి. అనంతరం మే 2015 సంచిక నుండి చేపట్టిన హిందీ సహవాస్ వివరాలు డిశంబరు 2015కి పూర్తయ్యింది. 2016 జనవరి నుండి మరాఠీ సహవాస్ వివరాలు ధారావాహిక సీరియల్‌గా అందజేస్తున్నాం. మెహెరాబాద్‌లో 1955 నవంబరులో చేపట్టిన ఈ ప్రాంతీయ సహవాస్‌లో మరాఠీ సహవాస్ చిట్టచివరిది. గత సంవత్సరం దాదాపుగా ప్రతి సంచికలో బాబా సేవలో తరించిన పలువురి బాబా ప్రేమికుల వివరాలను ఈ తరం వారికోసమని సంక్షిప్తంగానూ, సవివరంగా అందజేసే ప్రయత్నం చేశాం.

ఆ కోవలో జనవరి 2015 సంచికలో శ్రీ ఏ.యస్.జగన్నాథ్ గారి గురించి సవివర సమాచారం అందజేసే ప్రయత్నం చేశాం. మార్చిలో శ్రీ జాల్ ఫిరోజ్ దస్తూర్, (జాల్ భాయ్, మెహెరాబాద్) తో జరిపిన ఇంటర్వ్యూ వివరాలు ప్రచురించాం. అలాగే, మెహెర్‌బాబా తొలి కార్యదర్శి, దాదా ఛాంజీ గురించి (జూన్ 2015), అబ్దుల్లా పక్రవాన్ (జూలై 2015), రష్యన్ బాబా ప్రేమికురాలు నాదినే టాలిస్టాయ్, (ఆగస్టు 2015), మార్గెట్ క్రాస్కీ, ఇంగ్లాండు (సెప్టెంబరు 2015), మెహెర్‌బాబాకు అత్యంత ప్రియమైన సూఫీ కవి హాఫీజ్ (అక్టోబరు 2015), ఐవీ ఒనైటా డ్యూక్, జీన్ ఆడ్రియల్ (నవంబరు 2015), విలియం డాంకిన్ (డిశెంబరు 2015)ల గురించి అరుదైన సమాచారం అందజేసే ప్రయత్నం చేశాం. కాగా,
యాత్రా కథనంగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు సమీపంలోని కుల్దాబాద్ – సాధు సజ్జనుల జన్మ స్థానం గురించి, పూణేలోని బండార్కర్ వీధిలోని రామచంద్ర గాడేకర్ గారి ఇల్లు – హెరిటేజ్ ప్రాంగణం గురించి చక్కని ప్రత్యేక శీర్షిక అందజేశాం. అన్నింటికంటే మిన్నగా, భగవదోన్మత్తులైన మస్తులు, అవతారుడు అమితంగా ప్రేమించిన ఐదుగురు గురించి, ముఖ్యంగా మహ్మద్ మస్తు, చట్టి బాబా, కరీం బాబా, ఆలీషా, చాచా మస్తుల గురించి, సవివర వివరణలతో, బాటసారులు శీర్షికతో 2015 మే నుండి సెప్టెంబరు సంచిక వరకూ వరుస సీరియల్‌గా ప్రచురించాం.
ముఖ్యంగా, మల్లాది రామారావు గారి కలంలో – మెహెర్ ప్రభు – లార్డ్ మెహెర్ (1925 – 1930) ధారావాహిక సీరియల్‌గా 2005 జనవరి నుండి గత దశాబ్ధ కాలం పైగా ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.
బాబా ప్రేమిక పాఠకులు ముఖ్యంగా మహిళలు ఈ సీరియల్‌ను ఎంతో ఆసక్తితో, అనురక్తితో బధ్రపరుచుకుంటున్నారని తెలిసి మేమెంతో సంతోషిస్తున్నాం. త్వరలో ఈ రచనను ఒక పుస్తక రూపంలో ప్రచురించి పాఠకులకు అందించాలని మా ఆకాంక్ష. కాగా, ఇందుకోసం డాక్టర్ రామనాథం, హైదరాబాద్, ఈ పుస్తక ప్రచురణ నిమిత్తం తన వంతుగా రూ 10,000 అందజేశారు. ఆ నగదును మెహెర్‌బాబా వార్షిక సభ్యత్వపు బ్యాంకు ఖాతాలో జమ చేసి వుంచామని ఇప్పటికే తెలియజేశాం.
**2015 సంవత్సరంలో పలువురు బాబా ప్రేమికులు శ్రీ బాలకృష్ణారావు గారు (87) శ్రీ నీలాపు మోహనరావు (పార్వతీపురం), శ్రీ గుజ్జల శంకరరెడ్డి, నిజామాబాద్, శ్రీ సి.వై. చింతామణి గారి భార్య శ్రీమతి భారతీ మణి, శ్రీమతి సీతామహాలక్ష్మి, కోఠి సెంటర్, శ్రీ పనసన్న గారి భార్య శ్రీమతి సత్యవతి, (మండపేట), శ్రీ కె.వి. సూర్యనారాయణ (మండపేట), శ్రీ మందా శంకర రెడ్డి, బందరు, తదితరులు ఈ ఏడాదిలో బాబాలో ఐక్యమయ్యారు.**
**వీరందరూ ధన్యులు. శెలవ్!!**

# విశాఖపట్నం

27.12.2015న విశాఖలో జరిగిన అవతార్ మెహెర్‌బాబా మహిళా ప్రేమిక సహవాస్‌లో శ్రీమతి సౌభాగ్యం గారు సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. సంకీర్తన, కవాలి డాన్సులు కాంతిరేఖ నాటిక ప్రదర్శించారు. ప్రత్యేక అతిథిగా డా॥ పి.హేమలత, **మానవాళికి ఆధ్యాత్మిక అవసరం** అంశంపై ప్రసంగించారు. ముఖ్యవక్తగా శ్రీమతి హరిప్రియ, తన ఆరాధ్యుడైన పరమేశ్వరుడు మెహెర్‌బాబా అని తన అనుభవాలను తెలియజేశారు.

# విశాఖలో సత్సంగ్

శ్రీ హేమసుందర్ గారి భార్య శ్రీమతి కె. లక్ష్మి 08.12.2015 మంగళవారం బాబాలో ఐక్యమైనందున వారి కుటుంబ సభ్యులు 19.12.2015 శనివారం నాడు ఏర్పాటు చేసిన సత్సంగ్‌లో చాలామంది ప్రేమికులు హాజరై ఆమె ఆత్మశాంతికై సంకీర్తనలు చేశారు. లక్ష్మి గారు ప్రతి కార్యక్రమానికి సమయానికి హాజరై సంకీర్తన చేసేవారని శ్రీ టి.ఎ. నారాయణ, స్థానిక సెంటర్ కార్యదర్శి తెలిపారు.

# విజయవాడ

అవతార్ మెహెర్‌బాబా విజయవాడ సెంటర్‌లో ప్రతివారం జరిగే సత్సంగ్‌లకు అదనంగా 31.12.2015న 2015వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2016వ సంవత్సరానికి ఆహ్వానంగా బాబా సెంటర్‌లో రాత్రి 10.30 నుండి 12 దాకా బాబా పాటలు, ప్రార్ధనలు, హారతి కార్యక్రమము జరిగింది. జనవరి 1న స్థానిక సెంటర్‌లో సా. 6 నుండి 8 వరకు సత్సంగ్ జరిగినది. శ్రీమతి జి. సుబ్బలక్ష్మి బాబా సందేశాలపై ప్రసంగించారు.

# తుమ్మపాల

అవతార్ మెహెర్‌బాబా తుమ్మపాల కేంద్రం నాల్గవ వార్షికోత్సవ వేడుకలు క్రిస్మస్ రోజున వైభవంగా జరిగాయి. ముందుగా నగర సంకీర్తన అనంతరం సప్తవర్ణ పతాకావిష్కరణ శ్రీ సి. శివయ్య చేశారు. దంతులూరి బంగార్రాజు కళ్యాణమండపంలో ప్రేమిక సహవాస్ జరిగింది. మెహెర్‌బాబా సత్య ప్రేమ సందేశాలపై శ్రీయుతులు డా॥ విజయసారథి, తాడేపల్లిగూడెం, శ్రీ పుల్ల చంద్రరావు, రాజమండ్రి, శ్రీ రాపర్తి వెంకటరావు, శ్రీ ఉరిటి శ్రీనివాసరావు,తుమ్మపాల, శ్రీ వల్లూరి నాగేశ్వరరావు, గాజువాక, మెహెర్ ప్రసాద్, విశాఖపట్నం, శ్రీ ఆర్.ఎం. రాజు, శ్రీ కె.వి. రత్నం, డా॥ అప్పారావు, శ్రీ ఇ. వెంకటరమణ, శ్రీ గండేపల్లి వెంకట్, శ్రీ మొగసాల వెంకట్, శ్రీ గండేపల్లి కొండలరావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి గూడెం సెంటర్ నుండి 62 మంది బాబా ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జీవిత సభ్యత్వం

**2016 జనవరి నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | జనవరి,16 | శ్రీ కె.వి.బి. గుప్త, విజయవాడ | రూ.500.00 |
| | | **మొత్తం** | **రూ. 500.00** |

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000029152,**
**IFSC CODE: IOBA 0001732.**

మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973,**
**IFSC CODE: IOBA 0001732.**

వార్షిక సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్, ద్వారా పంపువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:**

ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్,
ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218. **email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month, Posted at Patrika Channel on 19 / 20th every month.